

రాక్‌ట్రీ పనులపై విజిలెన్స్ తనిఖీలు

- పని కంటే ఎక్కువ బిల్లుల చెల్లింపులపై ఆరా

- 4వ పేజీలో



సబ్బవరం మండలం గొల్లలపాలెంలో కాలనీని తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

స్టీల్‌ప్లాంటు విలవిల



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ముడి పదార్థాలు లేకపోవడంతో పడిపోయిన ఉత్పత్తి

- నిర్వహణ పేరుతో మరో బ్లాస్ట్ ఫర్నేస్ మూసివేత
- రెండు పోర్టుల్లో కోకింగ్ కోల్ నిల్వలు
- కోర్టు అటాచ్‌మెంట్లతో విడుదల కాని వైనం
- ఆర్థిక సమస్యలే కారణం
- కేంద్ర, రాష్ట్రాలు సాయం అందించాలని కోరుతున్న ఉద్యోగులు, కార్మికులు

విశాఖపట్నం స్టీల్ ప్లాంటు ముడి పదార్థాల కోసం విలవిలలాడుతోంది. అందుబాటులో నిల్వలు ఉన్నా సొమ్ము చెల్లించలేక వాటిని వినియోగించుకోలేక పోతోంది. ఆర్థిక వనరుల లేమి తీవ్రంగా ఉంది. స్టీల్‌ప్లాంటులో మూడు బ్లాస్ట్ ఫర్నేసు(బీఎఫ్)లకు గాను బీఎఫ్-1ను పూర్తిగా మూసేసి మిగిలిన రెండింటినే నడుపుతున్నారు. వీటికి రోజుకు సగటున 5,300 టన్నుల కోకింగ్ కోల్ అవసరం. అయితే శుక్రవారం నాటికి యార్డులో 4,654 టన్నులు మాత్రమే ఉంది. అంటే అది ఒక రోజుకు కూడా సరిపోదు. దాంతో బీఎఫ్-3ను కూడా నిర్వహణ పేరుతో షట్ డౌన్ చేశారు. అంటే ప్రస్తుతం ఒక్క బీఎఫ్-2లోనే ఉత్పత్తి జరుగుతోంది. వాస్తవానికి రోజుకు 20వేల టన్నుల ఉత్పత్తి జరగాల్సి ఉండగా, ఆగస్టు 14వ తేదీ నాటికి సగటు ఉత్పత్తి 12,500 టన్నులకు పడిపోయింది. ఇప్పుడు అది సగానికి తగ్గిపోనుంది.

పోర్టులో బొగ్గు..కోర్టుల్లో అటాచ్‌మెంట్లు

స్టీల్ తయారీకి అవసరమైన బొగ్గును విదేశాల నుంచి తెప్పించుకుంటున్నారు. దీనికి ముందుగా 50 శాతం చెల్లించి లెటర్ ఆఫ్ క్రెడిట్ తీసుకుంటారు. బొగ్గుతో నౌక ఇక్కడి పోర్టుకు చేరగానే మిగిలిన 50 శాతం, రవాణా చార్జీలు, కస్టమ్స్ డ్యూటీలు చెల్లిస్తే నౌక నుంచి సరకు దించి ప్లాంటుకు పంపుతారు. అయితే స్టీల్‌ప్లాంటు చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో షిప్‌మెంట్ ఏజెన్సీలకు డబ్బులు కట్టలేకపోతోంది. దాంతో వారు కోర్టులను ఆశ్రయించి అటాచ్‌మెంట్లు తీసుకుంటున్నారు. గంగవరం పోర్టులో 1,41,273 టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. వాటిపై రూ.200 కోట్ల విలువైన కోర్టు అటాచ్‌మెంట్లు ఉన్నాయి. అదేవిధంగా విశాఖపట్నం పోర్టులో 77,223 టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. వాటిపై రూ.100 కోట్ల వరకు అటాచ్‌మెంట్లు ఉన్నాయి. ఆ బకాయిలు చెల్లిస్తే గానీ బొగ్గు విడుదల కాని పరిస్థితి నెలకొంది. ఇప్పుడు అత్యవసరంగా నిధులు అవసరం. రాష్ట్ర ప్రభుత్వం కల్పించుకొని ఏదో విధంగా సాయం చేయాలని ఉక్కు ఉద్యోగులు, కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. హౌసింగ్ స్కీమ్‌లు, రాజధాని నిర్మాణానికి స్టీల్ అవసరం కాబట్టి అడ్వాన్స్‌గా రూ.2 వేల కోట్లు ఇస్తే...అందుకు సరిపడా స్టీల్ ఇస్తామని విశాఖ స్టీల్ ఎగ్జిక్యూటివ్స్ అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్‌ను కలిసి కోరారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు ఈ విషయంలో తగిన శ్రద్ధ తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఉక్కు మంత్రి చెప్పినా ఇవ్వడం లేదు

ఇటీవల విశాఖపట్నం వచ్చిన ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి దృష్టికి బొగ్గు సమస్యను తీసుకువెళ్లగా, సెయిల్ కోసం తెప్పించిన మూడు నౌకల బొగ్గును ఈ స్టీల్‌ప్లాంటుకు ఇవ్వాలని ఆదేశించారు. మూడు నౌకలు అంటే సుమారు 2.25 లక్షల టన్నులు. అయితే ఆరు ర్యాకుల (ఒక్కో ర్యాక్‌కు 4 వేల టన్నులు) ద్వారా 24 వేల టన్నులు ఇచ్చి, ఆ తరువాత చేతులు ఎత్తేశారు.

అధిక వినియోగం

స్టీల్‌ప్లాంటులో ఆపరేషన్స్ విభాగానికి డైరెక్టర్ లేరు. ఆ బాధ్యతలను ప్రాజెక్ట్స్ చూసే అధికారికి అప్పగించారు. ఆయనకు, సీఎండీకి ఇద్దరికీ ఆపరేషన్స్‌లో అనుభవం లేకపోవడంతో బొగ్గు ఎక్కువగా ... మిగతా 4వ పేజీలో

ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ

- బొత్స ఏకగ్రీవ ఎన్నిక

కోడ్ ఎత్తివేతకు ఒకటి, రెండు రోజుల్లో ఉత్తర్వులు



ధ్రువీకరణపత్రంతో బొత్స

విశాఖపట్నం/మహారాణిపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి):

ఎమ్మెల్సీ (స్థానిక సంస్థల కోటా) ఎన్నికల ప్రక్రియ ముగిసింది. పోటీలో వైసీపీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ ఒక్కరే ఉండడంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు శుక్రవారం సాయంత్రం రిటర్నింగ్ అధికారి, విశాఖపట్నం జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ప్రకటించారు. అనంతరం తన ఛాంబర్‌లో బొత్సకు ధ్రువీకరణ పత్రం అందజేశారు. బొత్స సత్యనారాయణ 2027 డిసెంబరు ఒకటో తేదీ వరకూ ఎమ్మెల్సీగా కొనసాగనున్నారు. ఇదిలావుండగా ఎమ్మెల్సీ ఎన్నిక ఏకగ్రీవమైనట్టు ఎన్నికల సంఘానికి రిటర్నింగ్ అధికారి నివేదిక పంపారు. ఒకటి, రెండు రోజుల్లో కోడ్ ఎత్తివేతకు సంబంధించి ఆదేశాలు వెలువడనున్నాయి. ఎన్నికల కమిషన్ నుంచి అధికారికంగా ఉత్తర్వులు వచ్చిన తరువాత యథావిధిగా అభివృద్ధి/సంక్షేమ కార్యక్రమాల అమలుకు చర్యలు తీసుకోనున్నారు. ఇంకా అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో తహసీల్దార్లకు పోస్టింగ్ ఇచ్చేందుకు మార్గం సుగమం కానున్నది.

అందరికీ ధన్యవాదాలు: ఎమ్మెల్సీ బొత్స

శ్రావణ శుక్రవారం వంటి పవిత్రమైన రోజున ఎమ్మెల్సీగా ఎన్నిక కావడం ఆనందంగా ఉందని బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఎమ్మెల్సీగా ధ్రువీకరణపత్రం అందుకున్న తరువాత విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. జిల్లా అభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషిస్తామని పేర్కొన్నారు. బొత్స వెంట రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఎమ్మెల్సీలు సురేష్‌బాబు, వరుదు కల్యాణి, కుంభా రవిబాబు, జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యేలు కన్నబాబురాజు, కరణం ధర్మశ్రీ, కంబాల జోగులు, నాగిరెడ్డి, అదీప్‌రాజ్ ఉన్నారు.

నేడు వైద్య సేవలు బంద్

అత్యవసర సేవలు, శస్త్ర చికిత్సలు మినహా మిగిలినవన్నీ నిలిపివేస్తున్నట్టు వైద్య సంఘాల ప్రకటన

- కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారానికి నిరసన
- సంఘీభావాన్ని ప్రకటించిన ఇతర అసోసియేషన్లు, వైద్య, అనుబంధ సంఘాల ప్రతినిధులు



బీచ్‌రోడ్డులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, ప్రజాసంఘాల ప్రతినిధులు

- విద్యార్థి, ప్రజా సంఘాల మద్దతు
- రిలే దీక్షలు, ర్యాలీల నిర్వహణ
- కేజీహెచ్ సహా ఇతర ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఓపీ సేవలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

విశాఖపట్నం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి):

కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ ఆస్పత్రిలో వైద్య విద్యార్థినిపై హత్యాచారాన్ని నిరసిస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) వైద్య సేవల బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ మేరకు శనివారం ఉదయం ఆరు నుంచి ఆదివారం ఉదయం ఆరు గంటల వరకు వైద్య సేవలను నిలిచిపోనున్నాయి. అత్యవసర వైద్య సేవలు మినహా మిగిలిన ఓపీ, ఐపీ, స్కానింగ్, రక్త, ఇతర పరీక్షలను 24 గంటలపాటు ఆపివేయనున్నారు. ప్రభుత్వ వైద్యుల సంఘం, ఏపీ రేడియాలజిస్ట్ అసోసియేషన్, ఏపీ ప్రైవేటు నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్, ఏపీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్, జూనియర్ వైద్యుల సంఘం, పలు విద్యార్థి, ప్రజా సంఘాలు బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ప్రభుత్వ ... మిగతా 4వ పేజీలో

టీడీఆర్ హబ్‌పై విచారణ

- ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆదేశాలు
- డీన్ ప్రొఫెసర్ మల్లిఖార్జునరావు నేతృత్వంలో ఐదుగురితో కమిటీ
- పీహెచ్‌డీ ప్రవేశాలు, గైడ్లుగా నియమితులైన వారి అర్హత, పరిశోధన సాగిన తీరు వంటి అంశాలు పరిశీలన



విశాఖపట్నం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర యూనివర్సిటీ పరిధిలో గల ట్రాన్స్ డిసిప్లినరీ రీసెర్చ్ హబ్ (టీడీఆర్) వ్యవహారాలపై ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు విచారణకు ఆదేశించారు. గడిచిన ఐదేళ్లలో టీడీఆర్ హబ్‌లో భారీ అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు ఉన్నాయి. అస్మదీయులైన వారికి అడ్డగోలుగా పీహెచ్‌డీ ప్రవేశాలు కల్పించారన్నది ప్రధానమైన ఆరోపణ. దానిపై వీసీ దృష్టిసారించారు. టీడీఆర్ హబ్‌లో జరిగిన వ్యవహారాలపై పూర్తిస్థాయి విచారణ జరిపి నివేదిక అందించాల్సిందిగా ఆదేశించారు. ఇందుకు ప్రత్యేకంగా కమిటీని నియమించారు. టీడీఆర్ హబ్ డీన్‌గా ప్రొఫెసర్ జేమ్స్ స్టీఫెన్‌ను తొలగించి ఆ స్థానంలో ప్రొఫెసర్ మల్లిఖార్జునరావుకు బాధ్యతలు అప్పగించారు. ఆ కమిటీకి కూడా ఆయన నేతృత్వం వహిస్తారు. ఆయనతోపాటు శ్రీకాకుళం జిల్లా అంబేడ్కర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత, విజయనగరం జేఎన్‌టీయూ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్, ఏయూ వాతావరణ, సముద్ర అధ్యయన విభాగాధిపతి ప్రొఫెసర్ సునీత, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ డిపార్టుమెంట్ ప్రొఫెసర్ గోపీచంద్ నాయక్ సభ్యులుగా ఉంటారు. గడిచిన కొన్నాళ్లుగా టీడీఆర్ హబ్ ఆధ్వర్యంలో జరిగిన పీహెచ్‌డీ ప్రవేశాలు, అనుసరించిన నిబంధనలను కమిటీ పరిశీలించనున్నది. అలాగే, సుమారు 400 మందికి గైడ్లుగా అవకాశం కల్పించారు. వీరిలో ఏయూ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులు ఉన్నారు. అయితే, చాలా మందికి అర్హతలు లేకపోయినప్పటికీ అవకాశం కల్పించారన్నది ఆరోపణ. గైడ్లుగా అవకాశం పొందేందుకు ఉన్న అర్హతలు వంటి అంశాలను పరిశీలించనున్నారు. ప్రస్తుతం 600 మంది పరిశోధకులు ఉన్నారు. వీరిలో కొందరు ఆర్‌సెట్ ... మిగతా 4వ పేజీలో

భూ అక్రమాలపై ఉక్కుపాదం

గత ప్రభుత్వ హయాంలో సాగిన ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు జారీ, 22-ఎ జాబితా నుంచి మినహాయింపు, ల్యాండ్ పూలింగ్‌పై విచారణ

- నేటి ఉదయం రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా క్షేత్రస్థాయి పర్యటన, మధ్యాహ్నం సమీక్ష
- సాయంత్రం కలెక్టరేట్‌లో ఫిర్యాదుల స్వీకరణ



ఆర్‌పీ సిసోడియా

విశాఖపట్నం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి):

గత ప్రభుత్వ హయాంలో భారీఎత్తున జరిగిన భూఅక్రమాలపై ప్రస్తుత ప్రభుత్వం దృష్టిసారించింది. నాటి ప్రభుత్వ పెద్దలు కొందరు భూదందాలు, పంచాయితీలు ద్వారా చేజిక్కించుకున్న ప్రభుత్వ, ప్రైవేటు భూముల వివరాలను ఇప్పటికే సేకరించింది. అనధికార సమాచారం ప్రకారం వేల కోట్ల రూపాయల విలువైన భూములు వైసీపీ నేతలు, వారి సానుభూతిపరులు, కొందరు అస్మదీయులైన అధికారుల ఆధీనంలో ఉన్నాయి.

జిల్లాలో డీపట్టా భూములకు ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు జారీ, 22-ఎ జాబితా నుంచి మినహాయింపు, ల్యాండ్ పూలింగ్ వ్యవహారంపై ఎక్కువగా ఫిర్యాదులు రావడంతో విచారణకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకోసం రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియాను పంపించింది. ఆయన శనివారం ఉదయం జిల్లాలోని ఆనందపురం, పద్మనాభం, భీమిలి మండలాల్లో క్షేత్రస్థాయి పర్యటనకు వెళతారు. ఫ్రీహోల్డ్ భూములకు సర్టిఫికెట్ల జారీ, తరువాత అమ్మకాలు జరిపిన వ్యవహారంపై రైతులతో మాట్లాడతారు. ఇంకా రైతులను బెదిరించి తక్కువ రేటుకు తీసుకున్న భూములను పరిశీలించనున్నారు. ఈ సందర్భంగా ఆనందపురం, భీమిలి సబ్ రిజిస్ట్రార్, తహసీల్దారు కార్యాలయాలను ఆయన తనిఖీ చేస్తారు. అనంతరం మధ్యాహ్నం కలెక్టరేట్‌లో సబ్ రిజిస్ట్రార్లు, తహసీల్దార్లతో సమీక్ష నిర్వహిస్తారు. సాయంత్రం ఐదు గంటల తరువాత భూముల వ్యవహారంపై రైతులు, బాధితులు, ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నారు. ఇందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లుచేసింది.

ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్ల జారీ, కొనుగోళ్లు..

జిల్లాలో డీపట్టా భూములు సుమారు 11 వేల ఎకరాలు ఉండేవి. అందులో కొంత చాలాకాలం క్రితమే చేతులు మారింది. ఇటీవల జగనన్న కాలనీలకు 4,600 ఎకరాల వరకు సమీకరించారు. ఇంకా రైతుల వద్ద సుమారు మూడు వేల ఎకరాల వరకు ఉందని అంచనా. అయితే డీపట్టా తీసుకుని 20 ఏళ్లు పూర్తయిన భూములపై రైతులకు హక్కులు కల్పించేందుకంటూ వైసీపీ ప్రభుత్వం గత ఏడాది జీవో 596 జారీచేశారు. ఆ జీవో వస్తుందని ముందుగానే తెలుసుకున్న గత ప్రభుత్వంలో పలువురు పెద్దలు, ... మిగతా 4వ పేజీలో



ఫ్రీహోల్డ్ చేసిన ఆనందపురం మండలం రామవరం భూములు

కనకమహాలక్ష్మికి శ్రావణ శోభ



శ్రావణ శుక్రవారం సందర్భంగా కనకమహాలక్ష్మి అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

బీచ్‌లలో భద్రతపై దృష్టి

- అర్ధరాత్రి సమయంలో పోలీస్ కమిషనర్ ఆకస్మిక తనిఖీలు
- పోలీస్ పహారా, లైటింగ్ లోటుపాట్లు స్వయంగా పరిశీలన
- లోపాలు సరిదిద్దుకుంటే నేరాలకు ఆస్కారం ఉండదని భావన

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)



ఆర్కే బీచ్‌లో భద్రతను పరిశీలిస్తున్న సీపీ శంఖబ్రతబాగ్చి

నగరంలో బీచ్‌లను సురక్షిత ప్రాంతాలుగా తీర్చిదిద్దడంపై పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ప్రత్యేక దృష్టి సారించారు. బీచ్‌లలో రాత్రివేళ అసాంఘిక కార్యకలాపాలు, నేరాలు జరుగుతున్నాయనే ఫిర్యాదుల నేపథ్యంలో వాటికి అడ్డుకట్ట వేసేందుకు చర్యలు ప్రారంభించారు. ఇందులో భాగంగా నగరపరిధిలోని బీచ్‌లలో రాత్రివేళ పోలీసుల భద్రత, లైటింగ్ సదుపాయం ఎలా ఉన్నాయో పరిశీలించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో అప్పికొండ నుంచి భీమిలి వరకూ పదిచోట్ల సందర్శకులు సముద్ర స్నానాలకు దిగుతుంటారు. అలాగే నగరంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకులు, పర్యాటకులు రాత్రివేళ బీచ్‌కు వెళ్లి సేదతీరుతుంటారు. ఆ సమయంలో ఆకతాయిలు బీచ్‌లో చీకటిగా ఉన్న ప్రాంతాల్లో మహిళలు, యువతను ఆటపట్టిస్తున్నారు. అంతేకాకుండా మహిళలపై దాడులు, అఘాయిత్యాలు జరుగుతున్నాయి. అదే విధంగా రాత్రి సమయంలో బీచ్‌కు వచ్చే సందర్శకులు, పర్యాటకులు కొందరు తమ బ్యాగులను తీరంలో ఉంచి సముద్ర స్నానాలకు దిగుతుంటారు. ఇదే అదనుగా చిల్లరదొంగలు చేతివాటం ప్రదర్శించి బ్యాగులను, వాటిలోని విలువైన వస్తువులను అపహరించుకుపోతున్నారు. ప్రతీరోజూ బీచ్‌లో బ్యాగ్‌ల చోరీలకు సంబంధించి కేసులు నమోదవుతున్నాయి. రౌడీషీటర్‌లు కొందరు బీచ్‌లో రాత్రివేళ బీచ్‌లో కూర్చుని మాట్లాడుకుంటున్న జంటలను టార్గెట్ చేస్తున్నారు. దీనికి కారణం బీచ్‌లో సరిగా లైటింగ్ ఉండకపోవడం, పోలీస్ పెట్రోలింగ్ లేకపోవడమే విమర్శలు ఉన్నాయి. వీటన్నింటి నేపథ్యంలో బీచ్‌ల్లో నేరాలు జరగడానికి కారణం ఏమిటనే దానితో పాటు రాత్రివేళ వాస్తవ పరిస్థితి ఎలా ఉందో స్వయంగా పరిశీలించాలని సీపీ శంఖబ్రత బాగ్చి నిర్ణయించారు. ఇందులో భాగంగా వారం కిందట గాజువాక శివారు అప్పికొండ బీచ్‌ను అర్ధరాత్రివేళ సందర్శించారు. బీచ్‌లో రాత్రివేళ పోలీసుల పహారా, లైటింగ్ లేకపోవడం గమనించినట్టు తెలిసింది. బీచ్‌లో రాత్రివేళ కచ్చితంగా పోలీస్ పెట్రోలింగ్ ఉండేలా చర్యలు తీసుకోవాలని స్టీల్‌ప్లాంటు స్టేషన్ అధికారులను ఆదేశించారు. అలాగే బీచ్‌లో చీకటి లేకుండా లైటింగ్ ఏర్పాటు చేయాలని జీవీఎంసీ అధికారులకు సూచించారు. నాలుగు రోజుల కిందట ఆర్కే బీచ్ రోడ్డులో నడుచుకుంటూ వైఎంసీఏ వరకూ వెళ్లి స్వయంగా పరిస్థితులు పరిశీలించారు. బీచ్‌రోడ్డులో పోలీస్ పెట్రోలింగ్ ఉన్నప్పటికీ తీరంలో లేదని గుర్తించి అధికారులను సూచనలు జారీచేశారు. బీచ్‌లో చీకటిగా ఉన్న ప్రాంతాల్లో ఉన్న సందర్శకులు, యువకులను పిలిచి కౌన్సెలింగ్ చేసి పంపించారు. బీచ్‌రోడ్డులో కూడా చెక్‌పోస్ట్‌లు ఏర్పాటు చేయడం ద్వారా బైక్ రేసింగ్‌లకు అడ్డుకట్ట వేయాలని నిర్ణయించినట్టు సీపీ వెల్లడించారు. మిగిలిన బీచ్‌లలో కూడా భద్రతా లోపాలుంటే పరిశీలించి చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. బీచ్‌లలో భద్రతను పెంచడం ద్వారా వాటిని సురక్షిత ప్రాంతాలుగా తీర్చిదిద్దుతామని సీపీ తెలిపారు.

తీరంలో కదం తొక్కిన వైద్య విద్యార్థులు



బీచ్‌రోడ్డులో ర్యాలీ నిర్వహిస్తున్న జూనియర్ వైద్యులు



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న జూడాలు

మహారాణిపేట, ఆగస్టు 16: జాతీయస్థాయిలో వైద్యులకు రక్షణ చట్టం కల్పించాలని డిమాండ్ చేయడంతోపాటు కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచార ఘటనకు నిరసనగా జూనియర్ వైద్యులు సాగర తీరంలో కదం తొక్కారు. కోల్‌కతా ఆర్‌జీకర్ మెడికల్ కాలేజీలో వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన, సాక్ష్యాధారాలను చెరిపివేసేందుకు వీలుగా దుండగులు అర్ధరాత్రి మెడికల్ కాలేజీపై దాడి చేయడాన్ని తీవ్రంగా నిరసించారు. ఈ సంఘటన దేశానికి మాయని మచ్చ అంటూ దిక్కులు పిక్కటిల్లేలా నినదించారు. దేశంలో అరాచకాలు పెరిగిపోతున్నాయని,

కోల్‌కత్తా హత్యాచార ఘటనకు నిరసనగా భారీ ర్యాలీ

హత్యాచార ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని ముక్తకంఠంతో కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ముందుగా తామంతా మహిళలమని, ఆ తరువాతే వైద్యులమని సమాజం గుర్తించాలన్నారు. వైద్యులను దేవుళ్లతో పోలుస్తారని, వారిపైనే అత్యాచార ఘటనలకు పాల్పడితే ఇంతవరకు చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. వైద్యులకు సంపూర్ణ రక్షణను ఇచ్చేలా సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను తక్షణం తీసుకురావాలని, అప్పటివరకు దేశవ్యాప్తంగా అత్యవసర వైద్య సేవలను కూడా బహిష్కరిస్తామని హెచ్చరించారు. కాగా జూనియర్ వైద్యులు నిర్వహించిన భారీ ర్యాలీకి ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు, వైద్య సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, వామపక్ష సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటించి, ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం వైద్య విద్యార్థులు కేజీహెచ్ ప్రధాన పరిపాలన విభాగం ఆవరణలో బైఠాయించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో అత్యవసర సేవలకు ఇబ్బంది లేకుండా సూపరింటెండెంట్ చర్యలు తీసుకున్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞాన వికాసం



అల్లిపురంలో గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఎస్ రాజు

జ్ఞానాపురం, ఆగస్టు 16 : గ్రంథాలయాలు విజ్ఞాన వికాసానికి వేదికలని సెంచూరియన్ యూనివర్సిటీ ఛాన్సలర్ జీఎస్ఎస్ రాజు అన్నారు. అల్లిపురం వెంకటేశ్వరమెట్ట ప్రాంతంలో శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయాన్ని పునఃప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జీఎస్ఎస్‌రాజు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో 33వ వార్డు కార్పొరేటర్ బి.వసంతలక్ష్మి, గ్రంథాలయం అధ్యక్షుడు పొలమరశెట్టి శ్యామ్, కార్యదర్శి పొలమరశెట్టి శ్రీను, కోశాధికారి నర్సింగరావు, జనసేన నాయకులు గోపీకృష్ణ, ఆకుల రాజు, శరగడం భాస్కర్, మోహన్, బాబాజీ, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ టీచర్ల సంఘం కార్యవర్గం

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 16: ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక శుక్రవారం ఎంవీపీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రవి సిద్ధార్థ, రాష్ట్ర కార్యదర్శి పీవీఎస్ చందు పరిశీలకులుగా వ్యవహరించిన ఈ ఎన్నికల్లో సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో భాగంగా జిల్లా అధ్యక్షుడిగా పి.సురేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా వెంకట త్రినాథ్, కోశాధికారిగా బి. గణపతి ఎన్నికయ్యారు. భీమిలి మండల అధ్యక్షుడిగా జి. దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా వై.ప్రతాప్ సింగ్, సీతమ్మధార అధ్యక్షుడిగా నూకరాజు, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, ములగాడ అధ్యక్షురాలిగా శిరీష, కార్యదర్శిగా ఇందిరామణి, మహారాణిపేట అధ్యక్షురాలిగా కె.కృష్ణవేణి, కార్యదర్శిగా శివకృష్ణ, గోపాలపట్నం మండల అధ్యక్షురాలిగా నీరజ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాలు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

ఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌కు పురస్కారం



పతకం అందుకుంటున్న కానిస్టేబుల్ ఈశ్వరరావు

విశాఖపట్నం, ఆగస్టు 16: వాల్తేరు డివిజన్‌లోని మర్రిపాలెం ఆర్పీఎఫ్ పోస్టులో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న కే ఈశ్వరరావుకు ప్రతిభా పురస్కారం లభించింది. సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ ఆదేశాల మేరకు విధుల నిర్వహణలో చాకచక్యంగా వ్యవహరించి రైల్వే ఆస్తులు అపహరించిన కేసుల్లో నేరస్తులను గుర్తించడంతోపాటు గంజాయి రవాణా నిందితులను పట్టుకోవడంలో ఈశ్వరరావు ప్రతిభ చూపారు. ఈ నేపథ్యంలో 2023లో ఉత్తమ కానిస్టేబుల్‌గా గుర్తింపు పొందాడు. గురువారం భువనేశ్వర్‌లోని ఈస్ట్ కోస్ రైల్వేలో జరిగిన స్వాతంత్య్ర దినోత్సవంలో భాగంగా జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్‌నుంచి పతకం, ప్రశంసాపత్రం అందుకున్నారు.

ప్రపంచంలో మూడో బలమైన శక్తిగా భారత్

» ఢిల్లీ సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ కమొడోర్ ఉదయ భాస్కర్



మాట్లాడుతున్న కమొడోర్ ఉదయభాస్కర్

సీతంపేట, ఆగస్టు 16: ప్రస్తుతం ప్రపంచం వ్యాప్తంగా జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచంలో భారత్‌దేశం మూడో బలమైన శక్తిగా అవతరించాలని అభిలాషిస్తున్నట్టు ఢిల్లీ సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్‌కి చెందిన కమొడోర్ పి. ఉదయ భాస్కర్ పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ ఆధ్వర్యంలో భారతదేశ విదేశాంగ విధానానికి సంబంధించి వ్యూహాత్మక కార్యాచరణపై సదస్సును నిర్వహించారు. ముఖ్య వక్తగా విచ్చేసిన ఉదయభాస్కర్ మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో ఇటీవల చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలను వివరించారు. అలాగే, పొరుగునున్న చైనా రాజకీయ, ఆర్థికం, సైనిక పరంగా బలమైన శక్తిగా ఉందన్న విషయం గుర్తుపెట్టుకోవాలన్నారు. 1971 ముందు పరిస్థితులు బంగ్లాదేశ్‌లో రాగలవా.. అనే విషయంలో వేచి చూడాల్సి ఉందన్నారు. ఇప్పుడు మనం అలీన విధానం నుంచి పక్కకు జరిగామన్నారు. ప్రముఖ పాత్రికేయులు కె.వి. ప్రసాద్ మాట్లాడుతూ హిందూ సముద్ర ప్రాంతంలో భారత్ ఆధిపత్యం సాధించాలని పేర్కొన్నారు. సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ డైరెక్టర్ ఎ.ప్రసన్న కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పౌరగ్రంథాలయ సొసైటీ కార్యదర్శి వర్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

దువ్వాడ మీదుగా సంబల్‌పూర్, ఇరోడ్ మధ్య ప్రత్యేక రైలు

విశాఖపట్నం, ఆగస్టు 16: ప్రయాణికుల సౌకర్యార్థం వయా దువ్వాడ మీదుగా సంబల్‌పూర్, ఇరోడ్ మధ్య ప్రత్యేక రైలు ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. 08311 నంబరు గల రైలు ఈనెల 21 నుంచి నవంబరు 27 వరకు ప్రతి బుధవారం ఉదయం 11.35 గంటలకు సంబల్‌పూర్‌లో బయలుదేరి అదే రోజు రా త్రి 11.32 గంటలకు దువ్వాడ, మర్నాడు (గురువారం) రాత్రి 8.30 గంటలకు ఇరోడ్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08312 నంబరు గల రైలు ఈనెల 23 నుంచి నవంబరు 29 వరకు ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 2.45 గంటలకు ఇరోడ్‌లో బయలుదేరి మర్నాడు (శనివారం) మధ్యాహ్నం 1.08 గంటలకు దువ్వాడ, రాత్రి 11.15 గంటలకు సంబల్‌పూర్ చేరుతుంది.

కనకమహాలక్ష్మికి శ్రావణ శోభ



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

జగదాంబ కూడలి, ఆగస్టు 16: వన్‌టౌన్‌లోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శ్రావణమాసోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం వరలక్ష్మీ వ్రతం పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో ఉదయం కుంకుమ పూజలు, నామార్చనలు జరిగాయి. కుంకుమపూజల్లో పాల్గొన్న ఆలయ మాజీ ఛైర్మన్ వంకాలయ తాతాజీ ఇద్దరు భక్తులకు లక్ష్మీ వెండి ప్రతిమలను ఈవో శ్రీనివాసుల రెడ్డి, ఏఈవో వి.రాంబాబు చేతుల మీదుగా అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అధికారులు పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, ఆగస్టు 16: నిర్వహణ పనులు చేపడుతున్నందున శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. దాడి రామ్మూర్తి కల్యాణమండపం ఏరియా, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు, సాయిబాబా ఆలయం నుంచి ఎనభై అడుగుల రోడ్డు, ఓల్డ్ పోస్టాఫీస్ రోడ్డు ఏరియా, అక్కయ్యపాలెం ప్రధాన రహదారి, శ్రీనివాసనగర్ ఏరియా, నందగిరి నగర్ వినియోగదారులు సహకరించాలని కోరారు. అలాగే.. నిర్వహణ పనులు చేపడుతున్నందున శంకువానిపాలెం, సరోజిని హాస్పిటల్, చిన్నూరు, జీవీఎంసీ ఉన్నత పాఠశాల ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కన్యకాపరమేశ్వరికి సామూహిక వ్రతాలు



వ్రతాల్లో పాల్గొన్న మహిళలు



అలంకరణలో శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారు


మహారాణిపేట, ఆగస్టు 16: వన్‌టౌన్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు, వ్రతాలు అత్యంత వైభవంగా జరిగాయి. శ్రావణ మాసం రెండవ శుక్రవారం వరలక్ష్మి వ్రతం సందర్భంగా అమ్మవారికి తేనె, గంధం, పసుపు కుంకుమ, పండ్ల రసాలు 108 ద్రవ్యాలతోపాటు క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం పట్టు వస్త్రాలతో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. వివిధ రకాల పుష్పాలు, పసుపు కొమ్ములు, గాజులతో తీర్చిదిద్ది పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. మహిళలతో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.

డీఎస్సీలో సీఆర్పీలకు వెయిటేజీ ఇవ్వాలి

» ప్రభుత్వానికి సమగ్ర శిక్ష జిల్లా జేఏసీ ప్రతినిధులు విజ్ఞప్తి

కంచరపాలెం, ఆగస్టు 16 : త్వరలో నిర్వహించనున్న డీఎస్సీ -2024 లో సమగ్ర శిక్షలో పనిచేస్తున్న సీఆర్పీలకు వెయిటేజీ కల్పించాలని ఉద్యోగుల జిల్లా జేఏసీ నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సమగ్ర శిక్ష కాంట్రాక్టు &అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల విశాఖ జిల్లా జేఏసీ ప్రతినిధులు పి.గణపతి, ఎల్. చైతన్య శుక్రవారం స్థానిక బీఎస్ఆర్ భవనంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ, సమగ్ర శిక్షలో గత 12 ఏళ్లుగా బీఈడీ, టెట్ పరీక్షలు ఉత్తీర్ణత సాధించి చాలీచాలని జీతాలతో ఉద్యోగాలు చేస్తున్న సీఆర్పీలకు వెయిటేజీ ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. గతంలో ఐఈఆర్టీ టీచర్లు, అగ్రికల్చర్ తదితర విభాగాలకు వెయిటేజీ ఇచ్చిన ప్రభుత్వం విద్యాశాఖలో కీలక విధులు చేపడుతున్న సీఆర్పీలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు పార్టుటైం ఇన్‌స్ట్రక్టర్లతో పాటు అర్హులైన ఇతర విభాగాల వారికి వెయిటేజీను ప్రకటించి న్యాయం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కోరారు.

శెట్టిబలిజ అసోసియేషన్ కార్యవర్గం



చిన్నారికి బహుమతి అందిస్తున్న ప్రతినిధులు

మహారాణిపేట, ఆగస్టు 16: గొల్లలపాలెం శెట్టిబలిజ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. పాత జైలు రోడ్డు న్యూ రామాలయంలో అసోసియేషన్ 53వ వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడు పితాని నందకుమార్, అధ్యక్షుడిగా బత్తిన దంతేశ్వరరావు, ప్రధాన ప్రధాన కార్యదర్శిగా నాగుల సన్యాసిరావు కోశాధికారిగా కోస్సు శ్రీనివాస్ నియమితులయ్యారు. అనంతరం స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా పలువురికి బహుమతులు అందించారు.

వైభవంగా దుర్గాగణపతి ఆలయ వార్షికోత్సవం



ఉత్సవ పల్లకిని మోస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

సీతంపేట, ఆగస్టు 16: సీతంపేట ప్రధాన రహదారిలోని దుర్గాగణపతి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. 20వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో అర్చకులు నటరాజన్ దుర్గాగణపతికి పంచమృతాలు, సుగంధ ద్రవ్యాలు, జలాలతో అభిషేకాలు, పూజలు చేశారు. ముఖ్య అతిథిగా నార్త్ ఎమ్మెల్యే, బీజేపీ ఫ్లోర్‌లీడర్ పి.విష్ణుకుమార్‌రాజు విచ్చేసి దుర్గాగణపతికి పూజలు నిర్వహించారు. అనంతరం దుర్గాగణపతి పల్లకి ఉత్సవంలో పాల్గొని ఎమ్మెల్యే పల్లకిని మోశారు.

నందగరి నగర్‌లో ఉచిత వైద్య శిబిరం

అక్కయ్యపాలెం, ఆగస్టు 16 : గ్రేటర్ 44వ వార్డు నందగిరి నగర్‌లో లక్ష్మీ గాయత్రి హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ మేరకు స్థానికులకు హాస్పిటల్ ఎండీ కె.వెంకటరామ్‌కుమార్ వైద్య పరీక్షలు చేసి ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందగిరినగర్‌లో గత ఐదేళ్లుగా ప్రతి నెలా ఉచిత మెగా వైద్య శిబిరాన్ని కొనసాగిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమేష్, సిబ్బంది కోటి, ఈశ్వరరావు, సురేష్, సుజాత, నందగిరినగర్ సేవా సంఘం గౌరవాధ్యక్షుడు జయకుమార్, ఉపాధ్యక్షుడు గేదెల వెంకన్న, కార్యదర్శి బసవ గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

రాక్‌ట్రీ పనులపై విజిలెన్స్ తనిఖీలు

» పనికంటే ఎక్కువ బిల్లుల చెల్లింపులపై ఆరా

విశాఖపట్నం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు నగర శివారు ప్రాంతాల్లో రాక్‌ట్రీ ఇన్‌ఫ్రా కంపెనీ చేపట్టిన ఇళ్ల నిర్మాణాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులుతనిఖీలు చేపట్టారు. చేపట్టిన నిర్మాణాలు కంటే ఎక్కువగా చెల్లింపులు చేశారన్న ఆరోపణలతో తనిఖీలకు ప్రభుత్వం ఆదేశించింది. దీంతో శుక్రవారం సబ్బవరం మండలం గొల్లలపాలెం, పైడివాడ అగ్రహారం, నంగినారపాడు, పెదగంట్యాడ మండలం నడుపూరులో కాలనీలను విజిలెన్స్ అధికారులు పరిశీలించారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో పలు చోట్ల ఇళ్ల నిర్మాణ బాధ్యతలను కొన్ని సంస్థలకు అనధికారికంగా అప్పగించారు. జిల్లాలో సుమారు లక్ష ఇళ్ల నిర్మాణాలను చేపట్టిన కంపెనీల్లో అనంతపురం జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే సొంత కంపెనీ రాక్‌ట్రీ ఇన్‌ఫ్రా ఉంది. నిర్మాణాలు చేపట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించింది. తొలుత 35వేలకు పైగా ఇళ్ల నిర్మాణ బాధ్యతలను అప్పగించగా లక్ష్యాలను అనుగుణంగా పనులు చేపట్టలేదు. దీంతో కోత వేశారు. చివరికి 11,575 ఇళ్లు మాత్రమే అప్పగించారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో నిర్మాణాలపై ప్రభుత్వం విచారణకు సిద్ధమైంది. రాక్‌ట్రీ ఇన్‌ఫ్రాకు చేసిన పనుల కంటే ఎక్కువ చెల్లింపులు చేశారన్న ఫిర్యాదుల నేపథ్యంలో తనిఖీకి ఆదేశించింది.నాలుగు కాలనీల్లో మొత్తం 11,575 ఇళ్లలో ఇంతవరకు 4,744 ఇళ్లకుపూర్తిస్థాయిలో పునాదులు వేశారు. మరో 5,969కు అడుగు ఎత్తులో పునాది నిర్మించగా, 305 ఇళ్ల పునాదులకు గోతులు, 130 ఇళ్లకు కాలమ్స్ 28 ఇళ్ల కిటికీల ఎత్తు, 165 స్లాబ్ వరకు, 137 ఇళ్లకు స్లాబ్‌లు పూర్తిచేశారు. సిమెంట్, ఇనుము, ఇసుక మినహాయించిరూ.35,64,98,617 రాక్‌ట్రీ ఇన్‌ఫ్రాకు ఇచ్చారు.

'జిల్లా ప్రధాన న్యాయమూర్తిని బదిలీ చేయాలి'

సిరిపురం, ఆగస్టు 16: జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్‌ను తక్షణమే బదిలీ చేయాలని విశాఖ న్యాయవాదుల సంఘం డిమాండ్ చేసింది. ఈమేరకు శుక్రవారం వారు రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశారు. బెంచ్‌పై నుంచి న్యాయమూర్తి ప్రవర్తన సరిగ్గా లేదని, కేసుల విచారణ సమయంలో అసలైన విషయాలు పక్కనపెట్టి న్యాయవాదుల పట్ల అభ్యంతకరమైన వ్యాఖ్యలతో ప్రవర్తిస్తున్నట్టు లేఖలో ఆరోపించారు. అలాగే జిల్లా కోర్టులో దాఖలైన కేసుల్లో చిన్న చిన్న ఆరోపణల నెపంతో కేసులను విచారణకు స్వీకరించకుండా న్యాయవాదులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెప్పారు.

పర్యావరణ పరిరక్షణపై వర్క్‌షాపు

సీతంపేట, ఆగస్టు 16: ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా పర్యావరణ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో శుక్రవారం ఒక్క రోజు వర్క్‌షాపును నిర్వహించారు. ఏయూ ప్రొఫెసర్ వీహెచ్ శైలజ, పర్యావరణ నెట్‌వర్క్ కన్వీనర్‌కె.విజయబాబు,మేనేజర్‌ఎస్.రవికుమారి,స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు ఉన్నారు.

నేడు వైద్య సేవలు బంద్

... 3వ పేజీ తరువాయి

ఆస్పత్రులతోపాటు ప్రైవేటు హాస్పిటల్స్, నర్సింగ్ హోమ్స్, క్లినిక్స్‌లో కూడా 24 గంటలపాటు సేవలను నిలిపివేయనున్నారు. అత్యవసర వైద్య సేవలు, శస్త్ర చికిత్సలను మాత్రం నిర్వహిస్తామని ఐఎంఏ ప్రకటించింది.

నిరసన కార్యక్రమాలు

జూనియర్ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో శనివారం రిలే నిరాహార దీక్షలు ప్రారంభించనున్నారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు దీక్షలు నిర్వహిస్తారు. ఉదయం మానవహారం, ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి రైల్వే స్టేషన్ మీదుగా జీవీఎంసీ కార్యాలయం ఎదుటగల గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహిస్తారు. వైద్య విద్యార్థినికి జరిగిన అన్యాయంపై ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేయనున్నట్టు జూనియర్ వైద్యులు సంఘం సలహాదారు జహంగీర్ పేర్కొన్నారు. కోల్‌కతాలో మృతిచెందిన వైద్య విద్యార్థినికి న్యాయం జరిగేంత వరకు తమ నిరసన కొనసాగుతుందన్నారు. నిందితులను తక్షణమే ఉరి తీయాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో ప్రభుత్వ ఆస్పత్రులు

జూనియర్ వైద్యులతోపాటు ప్రభుత్వ వైద్యుల సంఘం కూడా బంద్‌కు మద్దతు తెలిపిన నేపథ్యంలో ఆంధ్ర మెడికల్ కళాశాల పరిధిలోని కేజీహెచ్, ఘోషా, ఈఎన్‌టీ, ఛాతీ, అంటువ్యాధుల ఆస్పత్రి, ప్రాంతీయ కంటి ఆస్పత్రి, మానసిక వైద్యశాల, విమ్స్‌లో రోగులు ఇబ్బందులు పడకుండా అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. కేజీహెచ్‌లో క్యాజువాల్టీ సేవలు అందించేందుకు 16 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, 26 మంది ప్రీ పారామెడికల్ డాక్టర్లు, ఓపీ విభాగాలు నిర్వహించేందుకు అనుగుణంగా ఆయా విభాగాలకు చెందిన ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లను ఏర్పాటుచేశారు. అత్యవసర శస్త్రచికిత్సల నిర్వహణకు ఇబ్బందులు లేకుండా 28 మంది అనస్థీషియన్‌లను అందుబాటులో ఉండాలని ఆదేశించారు. సెలవులు రద్దు చేసినట్టు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద తెలిపారు. విమ్స్‌లో కూడా మొత్తం 30 మంది వైద్య నిపుణుల బృందాన్ని అందుబాటులో ఉంచినట్టు డైరెక్టర్ డాక్టర్ రాంబాబు తెలిపారు.

భూ అక్రమాలపై ఉక్కుపాదం

... 3వ పేజీ తరువాయి

ఉన్నతాధికారులు ఆనందపురం, భీమిలి, పద్మనాభం, పెందుర్తి మండలాల్లో డిపట్టా భూముల రైతులతో మాట్లాడుకుని అడ్వాన్స్‌లు ఇచ్చారు. ఈ విషయంలో స్థానికంగా ఉన్న వైసీపీ నేతలు, కొందరు అధికారులు దళారులుగా వ్యవహరించారు. అలా వైసీపీ పెద్దలు, ఉన్నతాధికారులు ఒప్పందాలు కుదుర్చుకున్న భూములకు మాత్రమే ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు జారీచేశారు. గత ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన ఒకరు ఎక్కువ భూములకు అడ్వాన్స్ ఇచ్చారు. మాజీ ఉన్నతాధికారి ప్రమేయంతో త్రిలోక్, సుభాష్ అనే ఇద్దరు ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్ల జారీలో కీలకపాత్ర పోషించారు. అధికారికసమాచారం మేరకు జిల్లాలో 623 ఎకరాలకు ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు జారీచేయగా దాంట్లో 129 ఎకరాలు రైతుల నుంచి వేరే వ్యక్తులకు రిజిస్ట్రేషన్ జరిగింది. ఇంకా మరికొన్ని భూములకు అగ్రిమెంట్లు జరిగినా ఎన్నికలు రావడం తరువాత ప్రభుత్వంమారడంతోఫ్రీహోల్డ్ సర్టిఫికెట్ల జారీ, రిజిస్ట్రేషన్ నిలిచిపోయాయి.

ల్యాండ్ పూలింగ్‌లో అవకతవకలు

జగనన్న కాలనీల పేరిట జిల్లాలోని ఆనందపురం, పద్మనాభం, పెందుర్తి, భీమిలి, పెదగంట్యాడ మండలాల్లో సుమారు 4,600 ఎకరాలు సమీకరించారు. అయితే ఆ భూములకు ఆనుకుని ఉన్న కొన్ని డీపట్టా భూములను గత ప్రభుత్వ పెద్దలు అనధికారికంగా కొనుగోలు చేశారనే ఆరోపణలున్నాయి. ఇంకా ల్యాండ్ పూలింగ్‌కు భూములు ఇచ్చిన రైతులకు ఎకరాకు 900/450/250 గజాల వంతున అభివృద్ధి చేసిన ప్లాట్లుకేటాయించాలని నిర్ణయించారు. రైతులకు ఇవ్వనున్న ప్లాట్లను ముందుగానే కొందరు వైసీపీ పెద్దలు తక్కువ రేటుకు కొనుగోలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి.

22-ఎ నుంచి పలు భూములు మినహాయింపు?

22-ఎలో పొందుపరిచిన భూముల్లో కొన్నింటికి గత ప్రభుత్వంలో మినహాయింపు ఇచ్చారు. కొమ్మాది, పరదేశిపాలెం, పీఎం పాలెం, మధురవాడ, కాపులుప్పాడ, భీమిలి, సాగర్‌నగర్, ఆనందపురం ప్రాంతాల్లో మాజీ సైనికులు, స్వాతంత్ర్య సమర యోధులు, పొలిటికల్ సఫరర్లకు ఇచ్చిన భూములకు ఎన్‌వోసీ ఇచ్చి..తరువాత 22-ఎ నుంచి తప్పించారు. మధురవాడ, పీఎం పాలెం ప్రాంతాల్లో ఎన్‌వోసీ ఇచ్చిన భూముల చుట్టూ కొందరు పెద్దలు ఫెన్సింగ్ వేసి నిర్మాణాలు చేపడుతున్నారు. నగరంలో దసపల్లా భూములను 22-ఎ నుంచి తప్పించారు. సర్క్యూట్ హౌస్‌కు ఆనుకుని మరో ఐదెకరాలను 22-ఎ నుంచి తప్పించారు. ఇంకా ఎండాడ సర్వే నంబర్ 171లో ఎక్స్‌సర్వీస్‌మెన్‌కు కేటాయించిన ఐదెకరాలకు ఎన్‌వోసీ ఇచ్చిన తరువాత 22-ఎ నుంచి మినహాయించారన్న ఆరోపణలు ఉన్నాయి. గడచిన ఐదేళ్లలో 22-ఎ నుంచి తప్పించిన భూముల వివరాలు బయటపెడితే వాటిలో అక్రమాలు వెలుగులోకి వస్తాయని పలువురు కోరుతున్నారు.

స్టీల్‌ప్లాంటు విలవిల

... 3వ పేజీ తరువాయి

వృథా అవుతోంది. ఒక టన్ను స్టీల్ తయారీకి 500 టన్నుల బొగ్గు అవసరం కాగా గత కొంత కాలంగా 580 టన్నుల బొగ్గు వాడుతున్నారు. అదనంగా 80 టన్నులు పడుతోంది. ఈ వృథాను లెక్కిస్తే ఏడాదికి రూ.700 కోట్లు అదనపు భారం పడుతోందని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ కన్వీనర్ అయోధ్యరామ్ ఆరోపించారు. ముడి సరకులు లేక స్టీల్‌ప్లాంటులో ఉత్పత్తి ఆగిపోతున్నదని, దేశంలో ఇలాంటి దుస్థితి ఏ ప్లాంటుకూ లేదని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకొని ప్లాంటును పూర్తిస్థాయిలో నడిచేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

టీడీఆర్ హబ్‌పై విచారణ

... 3వ పేజీ తరువాయి

ద్వారా, మరికొందరు ఎగ్జిక్యూటివ్ కోటాలో ప్రవేశాలు పొందారు.ప్రవేశాలకు సంబంధించి అనుసరించిన నిబంధనలను కూడా పరిశీలించి నివేదిక అందించనున్నారు. టీడీఆర్ హబ్‌లోని గైడ్ల వ్యవహారంపై ప్రస్తుతం విచారణ సాగుతుండడంతో 2024-25 ఏడాదికి సంబంధించి పీహెచ్‌డీ ప్రవేశాలను వర్సిటీ ఉన్నతాధికారులు నిలిపి వేశారు. ఆర్‌సెట్ కన్వీనర్ టీడీఆర్ హబ్‌కు 172 పీహెచ్‌డీ సీట్లను కేటాయిస్తామని చెప్పినప్పటికీ..విచారణ పూర్త య్యేంత వరకు వద్దని చెప్పినట్టు వీసీ ప్రొఫెసర్ జి.శశి భూషణరావు వెల్లడించారు. ఈ వ్యవహారంపై నివేదిక వచ్చిన తరువాత అడ్మిషన్లు తీసుకుంటామన్నారు.

ఎమ్మెల్యేని కలిసిన ఎంపీపీ


ఎమ్మెల్యే పంచకర్లతో జెడ్పీటీసీ సభ్యురాలు, ఎంపీపీ

పెందుర్తి, ఆగస్టు 16: పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబును పెందుర్తి ఎంపీపీ మధుపాడ నాగమణి, జడ్పీటీసీ సభ్యురాలు ఉప్పిలిదేవి. మండల పాలక వర్గ సభ్యులు, సర్పంచ్‌లు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. అభివృద్ధి పనుల్లో సమ ప్రాధాన్యత కల్పించాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గోపాలపట్నం, ఆగస్టు 16: ఫీడర్ల నిర్వహణలో భాగంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. సుసర్లాకాలనీ, సీతారామరాజు నగర్, రెడ్డి వీధి, గాంధీనగర్, గవరవీధి, ఇందిరాప్రియదర్శిని కాలనీ, ఎన్ఏడీ ఎస్సీ కాలనీ ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

ఆదమరిస్తే ప్రమాదమే!


డ్రైవర్స్ కాలనీ రోడ్డులో గొయ్యి

ఆటోనగర్, ఆగస్టు 16: జీవీఎంసీ 70వ వార్డు డ్రైవర్స్ కాలనీ ప్రధాన రహదారి మధ్యన భారీ గొయ్యి పడడంతో రాకపోకలకు వాహన చోదకులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ మార్గంలో వివిధ పాఠశాలల విద్యార్థులు, కల్యాణ మండపాలకు ప్రజలు, ఆటోనగర్ కర్మాగారాలకు కార్మికులు రాకపోకలు సాగిస్తున్నారు. రాత్రి వేళల్లో పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

రేపటి నుంచి పోలమాంబ పండగ



మల్కాపురం, ఆగస్టు 16: మల్కాపురం ఎస్సీ కాలనీలోని పోలమాంబ అమ్మవారి పండగ ఈనెల 18, 19, 20 తేదీలలో నిర్వహించనున్నట్టు రామ్-రాంజీ సంక్షేమ సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈనేపథ్యంలో ఆలయానికి, ప్రధాన విగ్రహంతోపాటు వివిధ శక్తిరూపాలైన అమ్మవార్లు, పోతురాజు విగ్రహాలకు రంగులు వేశారు. ప్రధానకూడలిలో అమ్మవారి సదరం పట్టు కోసం తాత్కాలికంగా పాక నిర్మించారు. 18వ తేదీ ఉదయం అమ్మవారి పుట్టకు ఉపవాసం చెప్పి, సాయంత్రం పుట్టమన్ను తీసుకువచ్చి సదరం పట్టులో ఉంచి పూజలు చేస్తారు.

సఫాయి కర్మచారీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఆంజనేయ



ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 16: ప్రోగ్రెసివ్ సఫాయి కర్మచారీస్ రాష్ట్ర అధ్యక్షుడిగా స్టీల్ ప్లాంట్ ఉద్యోగి జి.ఆంజనేయ నియమితులయ్యారు. విజయవాడలో జరిగిన వర్కింగ్ కమిటీ సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. త్వరలో అన్ని జిల్లాల్లో పర్యటించి పారిశుధ్య కార్మికుల సమస్యలు తెలుసుకొని, పరిష్కారానికి కృషి చేస్తానని ఆంజనేయ తెలిపారు.

సినిమా గైడ్

- **తంగలాన్ :** శారద, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి).
- **మిస్టర్ బచ్చన్ :** కామేశ్వరి, మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సుకన్య (గోపాలపట్నం), కన్య, విశేష్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం).
- **ఆయ్ :** రమాదేవి, వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీనరసింహ (గోపాలపట్నం).
- **కమిటీ కుర్రోళ్ళు:** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక),
- **తుఫాన్ :** జగదాంబ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ (104 ఏరియా), నరసింహ(గోపాలపట్నం), శ్రీకన్య-1 (గాజువాక), ,అరుణ (పెదగంట్యాడ).
- **భవనమ్ :** లక్ష్మి (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి),
- **సింబా :** జగదాంబ, మోహిని (గాజువాక)
- **సంఘర్షణ :** క్రాంతి
- **శివం భజే :** లక్ష్మీకాంత్ (గాజువాక)
- **రాయన్ :** సంగం, శ్రీకన్య-2 (గాజువాక)
- **కల్కి :** శ్రీరామ, సప్తగిరి(తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 42, టమాటా 26,వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 52, బెండకాయలు 20, పచ్చిమిర్చి 54, కాకరకాయలు 34, బీరకాయలు 34, ఆనపకాయలు 16, కాలీఫ్లవర్ 38, క్యాబేజి 26, క్యారెట్ 28, దొండకాయలు 36, బంగాళదుంపలు 37, అరటికాయ 8, మునక్కాడలు (కిలో) 38, అల్లం 130, బరబాటి 28, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 82, గోరుచిక్కుడు 36, దోసకాయలు 22, వెల్లుల్లి 195, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 56, పొటల్స్ 34, కీరదోస 30, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 44, చిలగడదుంపలు 44, కంద 58, దేముడుచిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	495
విజయనగరం	499
శ్రీకాకుళం	499

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	83
ఫారం ధర	--	103
విత్ స్కిన్	--	176
స్కిన్‌లెస్	--	186

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 8లో..







ప్రసన్నగిరిపై పూజలు, గాజుల అలంకరణలో గ్రీన్‌సిటీ మహాలక్ష్మి, పెందుర్తిలో దుర్గమ్మ, ప్రత్యేక అలంకరణలో అగనంపూడి దుర్గమ్మ, ఉక్కులో త్రిశక్తి, వేపగుంట దుర్గాదేవి

ఆలయాల్లో ఘనంగా శ్రావణ శుక్రవారం పూజలు

కూర్మన్నపాలెం, ఆగస్టు 16: శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీవ్రతం సందర్భంగా పారిశ్రామిక ప్రాంతంలో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గ్రీన్ సిటీ మహాలక్ష్మి అమ్మవారిని సహస్రగాజులతో అలంకరించారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు.మాతృశ్రీనగర్‌లో కాశీ అన్నపూర్ణాదేవిని వెండి కవచంతో అలంకరించారు. గవరవీధి శ్రీకనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు జరిగాయి. 70వవార్డు ఎల్వీనగర్‌లో దుర్గమ్మకు సామూహిక కుంకుమ పూజలు చేశారు. డ్రైవర్స్ కాలనీ కనకదుర్గమ్మ ఆలయంలో పూజలు జరిగాయి. టీవీఎస్‌కాలనీలో వరలక్ష్మికి 27 రకాల పిండి వంటలు నివేదించారు.

కనకదుర్గకు గాజుల అలంకరణ

పెందుర్తి: ఆలయాల్లో శ్రావణ శుక్రవారం పూజలు ఘనంగా నిర్వహించారు. మహిళలు వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు. చినముషిడివాడ సప్తగిరినగర్ అలివేలు మంగాదేవికి పంచామృతాభిషేకాలు చేశారు. పెందుర్తి మహాకామేశ్వరి ఆలయంలో కుంకుమ పూజలు జరిగాయి. ఎస్ఆర్‌పురం కనకదుర్గ ఆలయంలో కమిటీ చైర్మన్ కాయితీ ఎర్రిబాబు ఆధ్వర్యంలో అమ్మవారిని గాజులతో అలంకరించారు.

దుర్గమాంబకు శ్రావణ పూజలు

అగనంపూడి: స్థానిక దుర్గమాంబ ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన వస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. భక్తులు పసుపు, కుంకుమలు, చీరలు సమర్పించి పూజలు చేశారు. సేవా సమితి మహిళలు లలితా, విష్ణుసహస్ర నామపారాయణం చేశారు. చిత్తా గణేశ్, చిత్తా రామారావు, తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: శ్రావణ మాస రెండో శుక్రవారం సందర్భంగా బీహెచ్‌పీవీ ప్రసన్నగిరి, షీలానగర్ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు సామూహిక కుంకుమ పూజలు చేశారు.

ఉక్కుటౌన్‌షిప్: స్టీల్‌ప్లాంట్ త్రిశక్తి ఆలయంలో విశేషపూజలు జరిగాయి.అమ్మవార్లను అలంకరించారు. సామూహిక కుంకుమ పూజలు, గోత్రనామార్చనలు చేశారు. సాయంత్రం హోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

వేపగుంట: కృష్ణానగర్ దుర్గామల్లేశ్వరాలయంలో అమ్మవారిని వెండి కవచంతో అలంకరించారు. అప్పల నర్సయ్య కాలనీ సంతోషిమాత ఆలయంలో ప్రత్యేక అలంకరణ, పూజలు జరిగాయి. రవినగర్ వెంకటేశ్వర స్వామి ఆలయంలో అభిషేకాలు, సామూహిక కుంకుమార్చనలు చేశారు.

ఎన్ఏడీ జంక్షన్: విమాన్‌నగర్ కనకమహాలక్ష్మీ అమ్మవారికి విశేష పూజలు చేశారు. అభిషేకాలు, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు.

కోల్‌కతా ఘటనపై కొవ్వొత్తులతో జూనియర్ వైద్యుల నిరసన

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 16: కోల్‌కతా ఆర్జీకర్ వైద్య కళాశాల ఆస్పత్రిలో జూనియర్ వైద్యురాలి హత్యా ఘటనను నిరసిస్తూ శుక్రవారం జూనియర్ వైద్యులు, స్థానికులు కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. జూనియర్ వైద్యులు కాకి షర్మిల, నీలాపు స్నేహలతారెడ్డి, సీహెచ్ మధుసూదనరావుల ఆధ్వర్యంలో మహిళలు, యువకులు తుంగ్లాంలోని గాంధీ విగ్రహం వద్ద మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ షర్మిల మాట్లాడుతూ నిందితులను కఠినంగా శిక్షించాలని, మహిళా వైద్యుల రక్షణకు ప్రభుత్వం చట్టాలు చేసి, సక్రమంగా అమలుచేయాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ ఎ.శ్రీనివాసరావు, నేతలు నావన సింహాచలం, అప్పారావు, పెంటయ్యరెడ్డి, శ్రీదేవి, రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


తుంగ్లాంలో కొవ్వొత్తులతో జూడాల నిరసన

నిందితులను కఠినంగా శిక్షించాలి

ఉక్కు టౌన్‌షిప్: కోల్‌కతా హత్యాచార ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ ఉక్కు జనరల్ ఆస్పత్రి వద్ద శుక్రవారం ఏపీ మహిళా సమాఖ్య సభ్యులు నిరసన తెలిపారు. రాష్ట్ర సమితి సభ్యులు బూసి పరమేశ్వరి మాట్లాడుతూ కోల్‌కత్తా జూనియర్ డాక్టర్ల పోరాటానికి సంఘీభావం తెలిపామన్నారు. లక్ష్మి,రమ్య, తులసి, డాక్టర్లు, నర్సులు పాల్గొన్నారు.



ఉక్కు జనరల్ ఆస్పత్రి ఎదుట ఆందోళన

‘గౌతు లచ్చన్న సేవలు చిరస్మరణీయం’

కూర్మన్నపాలెం,ఆగస్టు 16: స్వాతంత్ర సమర యోధుడు, సర్దార్ గౌతు లచ్చన్న సేవలు చిరస్మరణీయమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ అన్నారు. లచ్చన్న 115 జయంతి సందర్భంగా వడ్లపూడిలో శుక్రవారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పోతల కృష్ణ, గెద్దాడ రాంబాబు, జి.ఈశ్వరరావు, అప్పారావు, నూకరాజు, నాగరాజు, సత్యనారాయణ, అప్పలరాజు పాల్గొన్నారు. కణితిలో జరిగిన కార్యక్రమంలో ప్రగడ వేణుబాబు, ముద్దపు దామోదర్, కోమటి శ్రీనివాసరావు, దుగ్గపు దానప్పలు, బొండా గోవిందరాజులు, రమణ పాల్గొన్నారు. దువ్వాడలో కార్పొరేటర్ మొల్లి ముత్యాలునాయుడు లచ్చన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. గొలగాని సన్యాసిరావు, సారిపల్లి పైడిరాజు, ఉరుకూటి శ్రీను, రాము తదితరులు పాల్గొన్నారు.

గాజువాక: గౌతు లచ్చన్న జయంతిని టీడీపీ కార్యాలయంలో నిర్వహించారు. పార్టీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ లచ్చన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వెంకటరావు, సత్యారావు, లోకేశ్వరరావు, దేముడు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: సర్దార్ గౌతు లచ్చన్న గొప్ప నేతని సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు ఏజే స్టాలిన్ అన్నారు. గీత సహకులాల సంక్షేమ సంఘం శుక్రవారం సమతానగర్‌లో నిర్వహించిన గౌతు లచ్చన్న జయంతి ఉత్సవాల్లో ఆయన మాట్లాడారు. సంఘం అధ్యక్షుడు చెల్లుబోయిన నాయుడు, గౌరవాధ్యక్షుడు నెల్లి సాధూరావు, దుంగ దేవరాజు, వెంకటరమణ, పెదనూకరాజు, మంగరాజు తదితరులు పాల్గొన్నారు.


లచ్చన్న విగ్రహం వద్ద నేతల నివాళి

మాజీ ప్రధాని వాజ్‌పేయికి ఘన నివాళి


హిమాచల్‌నగర్‌లో వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మల్కాపురం, ఆగస్టు 16: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతిని హిమాచల్‌నగర్‌లో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొక్కిలగడ్డ విజయ్‌బాబు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రామీణసడక్ యోజన ద్వారా రహదారులను నిర్మించి, పట్టణాలకు అనుసంధానం చేసిన ఘనత వాజ్‌పేయిదేనన్నారు. పోఖ్రాన్ అణుపరీక్షలు చేసి ప్రపంచంలో మన దేశానికి గుర్తింపుతెచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామ్మోహన్‌నాయుడు, బీజేపీ నేతలు పోలిమేర శ్రీను, గురుమూర్తి, జి.సతీష్, కృష్ణారావు, రామకృష్ణ, సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గాజువాక: మాజీ ప్రధానమంత్రి వాజ్‌పేయి వర్ధంతిని శుక్రవారం గాజువాకలో బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు నేతృత్వంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విశాఖ అభివృద్ధికి వాజ్‌పేయి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వి.రోహిణి, గూటూరు శంకరరావు, రంగనాయకులు, రామునాయుడు, మనోహర్ పాల్గొన్నారు.

‘స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రం తక్షణమే ఆదుకోవాలి’

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 16: స్టీల్ ప్లాంట్‌ను కేంద్రం తక్షణమే ఆదుకోవాలని ఇంటక్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు కోరారు. ప్లాంట్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడున్నరేళ్లుగా స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యమం జరుగుతున్నప్పటికీ కేంద్రం ప్లాంట్‌ను నష్టపరిచే చర్యలు తీసుకుంటోందని ఆరోపించారు. ప్లాంట్‌ను పూర్తిగా నిర్వీర్యం చేసే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని, తద్వారా ప్లాంట్‌ను ప్రైవేటీకరించేందుకు కుట్ర జరుగుతోందన్నారు. బ్లాస్టఫర్నేస్‌లు పూర్తిగా మూసే దిశగా ఉందని, ఈ సమయంలో కేంద్రం స్పందించాలని కోరారు. ఎస్ఎ.నాయుడు, బీఎస్.రాజు, పీవీ.రమణమూర్తి, రాథోడ్, గొందేశి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నీరుకొండ రామచంద్రరావు

మర్రిపాలెంలో వాటర్ ఫౌంటెన్ ప్రారంభించిన ఎమ్మెల్యే

ఎన్ఏడీ జంక్షన్, ఆగస్టు 16: జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం ఉడాకాలనీలో కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యంతో ఏర్పాటుచేసిన వాటర్ ఫౌంటైన్‌ను శుక్రవారం ఎమ్మెల్యే గణబాబు ప్రారంభించారు. అసోసియేషన్ చేపడుతున్న కార్యక్రమాలు ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.వాసుదేవరావు, రాజు, అరుణ, కనకారావు, సూర్యనారాయణ, మురళి పాల్గొన్నారు.


ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే గణబాబు, కాలనీ సభ్యులు

శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రిలో 24 గంటలు వైద్యసేవలు బంద్

వేపగుంట, ఆగస్టు 16: శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రులలో శనివారం 24 గంటల పాటు వైద్య సేవలు నిలిపి వేస్తున్నట్టు ఆస్పత్రి డీజీఎం (హెచ్‌ఆర్) కె.బంగార్రాజు ఒక ప్రకటనలో తెలిపారు. కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై అత్యాచార సంఘటనకు నిరసనగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ఆలిండియా ఆప్తామాలజికల్ సొసైటీ పిలుపు మేరకు సేవలు నిలిపివేస్తున్నామన్నారు. అత్యవసర వైద్యసేవలకు మినహాయింపు ఉంటుందన్నారు.

ఎమ్మెల్యే గణబాబుకు ముస్లింల అభినందనలు

గోపాలపట్నం, ఆగస్టు 16: పశ్చిమ ఎమ్మెల్యే గణబాబుకు గోపాలపట్నం మసీదు కమిటీ సభ్యులు శుక్రవారం అభినందనలు తెలిపారు. తన విజయానికి మద్దకు తెలిపిన ముస్లిం సోదరులకు ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. గోపాలపట్నం, కొత్తపాలెం గ్రామాల్లోని మసీదులకు వెళ్లిన గణబాబుకు స్థానిక ముస్లింలు ఘన స్వాగతం పలికారు.


ఎమ్మెల్యే గణబాబును సత్కరిస్తున్న దృశ్యం

ఆటోనగర్‌లో రూ.2.8 కోట్లతో అభివృద్ధి పనులు

ఆటోనగర్, ఆగస్టు 16: ఆటోనగర్ పరిధిలో అధ్వాన స్థితికి చేరిన రహదారులను అభివృద్ధి చేసి వినియోగంలోకి తీసుకువస్తున్నారు. సుమారు రూ. 2.8 కోట్లతో డ్రైన్లు, రహదారుల వెడల్పు తదితర పనులు చురుగ్గా సాగుతున్నాయి. గతంలో స్థానికులు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఎట్టకేలకు సమస్య తీరుతుండడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆటోనగర్ బీ, డీ రహదారు లను పునర్నిర్మాణంతో ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం చూపుతున్నారు. ఆటోనగర్‌లో రోడ్లకు సుమారు రూ.1.82 కోట్లు, డ్రెయిన్లు రూ. కోటి కేటాయించారు. ఈ పనులు త్వరితగతిన పూర్తి చేస్తున్నట్టు ఐలా కమిషనర్ కె.జయచంద్ర తెలిపారు. రహదారులపై చెత్త వేయకుండా, కుండీలను వినియోగించుకోవాలని ఐలా చైర్మన్ సత్యనారాయణ రెడ్డి (రఘు), కమిటీ సభ్యులు కోరారు. స్వచ్ఛ ఆటోనగర్‌కు సహకరించాలన్నారు.


పనులు పరిశీలిస్తున్న ఐలా కమిషనర్ జయచంద్ర

విదేశీ విద్యపై విద్యార్థులకు అవగాహన

అగనంపూడి, ఆగస్టు 16: విదేశాల్లో ఉన్నత చదువులకు గల అవకాశాలపై శుక్రవారం దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల చివరి సంవత్సం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బెంగళూరు యూఎస్‌డీసీ యూనివర్సిటీ హెడ్ జతిన్‌ఖండేల్వా సదస్సును ప్రారంభించి విదేశీ కళాశాలల్లో అడ్మిషన్ పొందే విధానాన్ని వివరించారు. స్కాలర్‌షిప్‌లు సాధించి చదువుకోవడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. సదస్సులో ప్రొఫెసర్ మురళీకృష్ణ, రెక్టార్ మధుసూదనరావు, ప్రిన్సిపాల్ జె.సుధాకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న జతిన్‌ఖండేలా

అమృతరావు స్ఫూర్తితో ఉక్కు పరిరక్షణ పోరాటం

కూర్మన్నపాలెం, ఆగస్టు 16: విశాఖ ఉక్కు సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసిన తమనంపల్లి అమృతరావు స్ఫూర్తితో పోరాటాలను కొనసాగిస్తామని ఉక్కు పోరాట కమిటీ నాయకుడు వరసాల శ్రీనివాసరావు అన్నారు. నిరాహార దీక్షలో పాల్గొన్న కార్మికులనుద్దేశించి మాట్లాడుతూ ఈ నెల 17న ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాని మోదీని కలుస్తున్న నేపథ్యంలో ఉక్కు పరిస్థితిని వివరించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. గత ఏడాది బ్లాస్ట్ ఫర్నేస్‌ను మూసివేయడంతోనే పరిశ్రమ నష్టాల్లోకి వెళ్లిందన్నారు. కాంట్రాక్టు కార్మికులను, ఉద్యోగులను తొలగించాలని ప్రభుత్వం దుర్మార్గ ఆలోచనలు చేస్తే సహించేది లేదన్నారు. కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని కేంద్ర మంత్రి ప్రకటించే వరకూ పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు.



అమృతరావు చిత్రపటం వద్ద కార్మికుల నివాళి

గ్రంథాలయాలతో విజ్ఞాన వికాసం



అల్లిపురంలో గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఎన్ రాజు

జ్ఞానాపురం, ఆగస్టు 16 : గ్రంథాలయాలు విజ్ఞాన వికాసానికి వేదికలని సెంచూరియన్ యూనివర్సిటీ ఛాన్సలర్ జీఎస్ఎన్ రాజు అన్నారు. అల్లిపురం వెంకటేశ్వరమెట్ట ప్రాంతంలో శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయాన్ని పునఃప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జీఎస్ఎన్‌రాజు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో 33వ వార్డు కార్పొరేటర్ బి.వసంతలక్ష్మి, గ్రంథాలయం అధ్యక్షుడు పొలమరశెట్టి శ్యామ్, కార్యదర్శి పొలమరశెట్టి శ్రీను, కోశాధికారి నర్సింగరావు, జనసేన నాయకులు గోపీకృష్ణ, ఆకుల రాజు, శరగడం భాస్కర్, మోహన్, బాబాజీ, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ టీచర్ల సంఘం కార్యవర్గం

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 16: ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక శుక్రవారం ఎంవీపీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రవి సిద్ధార్థ, రాష్ట్ర కార్యదర్శి పీవీఎస్ చందు పరిశీలకులుగా వ్యవహరించిన ఈ ఎన్నికల్లో సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో భాగంగా జిల్లా అధ్యక్షుడిగా పి.సురేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా వెంకట త్రినాథ్, కోశాధికారిగా బి. గణపతి ఎన్నికయ్యారు. భీమిలి మండల అధ్యక్షుడిగా జి. దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా వై.ప్రతాప్ సింగ్, సీతమ్మధార అధ్యక్షుడిగా నూకరాజు, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, ములగాడ అధ్యక్షురాలిగా శిరీష, కార్యదర్శిగా ఇందిరామణి, మహారాణిపేట అధ్యక్షురాలిగా కె.కృష్ణవేణి, కార్యదర్శిగా శివకృష్ణ, గోపాలపట్నం మండల అధ్యక్షురాలిగా నీరజ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాలు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

ఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌కు పురస్కారం



పతకం అందుకుంటున్న కానిస్టేబుల్ ఈశ్వరరావు

విశాఖపట్నం, ఆగస్టు 16: వాల్తేరు డివిజన్‌లోని మర్రిపాలెం ఆర్పీఎఫ్ పోస్టులో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న కే ఈశ్వరరావుకు ప్రతిభా పురస్కారం లభించింది. సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ ఆదేశాల మేరకు విధుల నిర్వహణలో చాకచక్యంగా వ్యవహరించి రైల్వే ఆస్తులు అపహరించిన కేసుల్లో నేరస్తులను గుర్తించడంతోపాటు గంజాయి రవాణా నిందితులను పట్టుకోవడంలో ఈశ్వరరావు ప్రతిభ చూపారు. ఈ నేపథ్యంలో 2023లో ఉత్తమ కానిస్టేబుల్‌గా గుర్తింపు పొందాడు. గురువారం భువనేశ్వర్‌లోని ఈస్ట్ కోస్ రైల్వేలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవంలో భాగంగా జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్‌నుంచి పతకం, ప్రశంసాపత్రం అందుకున్నారు.

తీరంలో కదం తొక్కిన వైద్య విద్యార్థులు



బీచ్‌రోడ్డులో ర్యాలీ నిర్వహిస్తున్న జూనియర్ వైద్యులు



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న జూడాలు

మహారాణిపేట, ఆగస్టు 16: జాతీయస్థాయిలో వైద్యులకు రక్షణ చట్టం కల్పించాలని డిమాండ్ చేయడంతోపాటు కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచార ఘటనకు నిరసనగా జూనియర్ వైద్యులు సాగర తీరంలో కదం తొక్కారు. కోల్‌కతా ఆర్‌జీకర్ మెడికల్ కాలేజీలో వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన, సాక్ష్యాధారాలను చెరిపివేసేందుకు వీలుగా దుండగులు అర్ధరాత్రి మెడికల్ కాలేజీపై దాడి చేయడాన్ని తీవ్రంగా నిరసించారు. ఈ సంఘటన దేశానికి మాయని మచ్చ అంటూ దిక్కులు పిక్కటిల్లేలా నినదించారు. దేశంలో అరాచకాలు పెరిగిపోతున్నాయని,

కోల్‌కత్తా హత్యాచార ఘటనకు నిరసనగా భారీ ర్యాలీ

హత్యాచార ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని ముక్తకంఠంతో కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ముందుగా తామంతా మహిళలమని, ఆ తరువాతే వైద్యులమని సమాజం గుర్తించాలన్నారు. వైద్యులను దేవుళ్లతో పోలుస్తారని, వారిపైనే అత్యాచార ఘటనలకు పాల్పడితే ఇంతవరకు చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. వైద్యులకు సంపూర్ణ రక్షణను ఇచ్చేలా సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను తక్షణం తీసుకురావాలని, అప్పటివరకు దేశవ్యాప్తంగా అత్యవసర వైద్య సేవలను కూడా బహిష్కరిస్తామని హెచ్చరించారు. కాగా జూనియర్ వైద్యులు నిర్వహించిన భారీ ర్యాలీకి ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు, వైద్య సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, వామపక్ష సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటించి, ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం వైద్య విద్యార్థులు కేజీహెచ్ ప్రధాన పరిపాలన విభాగం ఆవరణలో బైఠాయించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో అత్యవసర సేవలకు ఇబ్బంది లేకుండా సూపరింటెండెంట్ చర్యలు తీసుకున్నారు.

ప్రపంచంలో మూడో బలమైన శక్తిగా భారత్

» ఢిల్లీ సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ కమొడోర్ ఉదయ భాస్కర్



మాట్లాడుతున్న కముడోర్ ఉదయభాస్కర్

సీతంపేట, ఆగస్టు 16: ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచంలో భారత్‌దేశం మూడో బలమైన శక్తిగా అవతరించాలని అభిలాషిస్తున్నట్టు ఢిల్లీ సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్‌కి చెందిన కమొడోర్ పి. ఉదయ భాస్కర్ పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ ఆధ్వర్యంలో భారతదేశ విదేశాంగ విధానానికి సంబంధించి వ్యూహాత్మక కార్యాచరణపై సదస్సును నిర్వహించారు. ముఖ్య వక్తగా విచ్చేసిన ఉదయభాస్కర్ మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో ఇటీవల చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలను వివరించారు. అలాగే, పొరుగునున్న చైనా రాజకీయ, ఆర్థికం, సైనిక పరంగా బలమైన శక్తిగా ఉందన్న విషయం గుర్తుపెట్టుకోవాలన్నారు. 1971 ముందు పరిస్థితులు బంగ్లాదేశ్‌లో రాగలవా.. అనే విషయంలో వేచి చూడాల్సి ఉందన్నారు. ఇప్పుడు మనం అలీన విధానం నుంచి పక్కకు జరిగామన్నారు. ప్రముఖ పాత్రికేయులు కె.వి. ప్రసాద్ మాట్లాడుతూ హిందూ సముద్ర ప్రాంతంలో భారత్ ఆధిపత్యం సాధించాలని పేర్కొన్నారు. సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ డైరెక్టర్ ఎ.ప్రసన్న కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పౌరగ్రంథాలయ సొసైటీ కార్యదర్శి వర్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

దువ్వాడ మీదుగా సంబల్‌పూర్, ఇరోడ్ మధ్య ప్రత్యేక రైలు

విశాఖపట్నం, ఆగస్టు 16: ప్రయాణికుల సౌకర్యార్థం వయా దువ్వాడ మీదుగా సంబల్‌పూర్, ఇరోడ్ మధ్య ప్రత్యేక రైలు ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. 08311 నంబరు గల రైలు ఈనెల 21 నుంచి నవంబరు 27 వరకు ప్రతి బుధవారం ఉదయం 11.35 గంటలకు సంబల్‌పూర్‌లో బయలుదేరి అదే రోజు రాత్రి 11.32 గంటలకు దువ్వాడ, మర్నాడు (గురువారం) రాత్రి 8.30 గంటలకు ఇరోడ్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08312 నంబరు గల రైలు ఈనెల 23 నుంచి నవంబరు 29 వరకు ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 2.45 గంటలకు ఇరోడ్‌లో బయలుదేరి మర్నాడు (శనివారం) మధ్యాహ్నం 1.08 గంటలకు దువ్వాడ, రాత్రి 11.15 గంటలకు సంబల్‌పూర్ చేరుతుంది.

కనకమహాలక్ష్మికి శ్రావణ శోభ



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

జగదాంబ కూడలి, ఆగస్టు 16: వన్‌టౌన్‌లోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శ్రావణమాసోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం వరలక్ష్మీ వ్రతం పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో ఉదయం కుంకుమ పూజలు, నామార్చనలు జరిగాయి. కుంకుమపూజల్లో పాల్గొన్న ఆలయ మాజీ చైర్మన్ వంకాలయ తాతాజీ ఇద్దరు భక్తులకు లక్ష్మీ వెండి ప్రతిమలను ఈవో శ్రీనివాసుల రెడ్డి, ఏఈవో వి.రాంబాబు చేతుల మీదుగా అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అధికారులు పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, ఆగస్టు 16: నిర్వహణ పనులు చేపడుతున్నందున శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. దాడి రామ్మూర్తి కల్యాణమండపం ఏరియా, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు, సాయిబాబా ఆలయం నుంచి ఎనభై అడుగుల రోడ్డు, ఓల్డ్ పోస్టాఫీస్ రోడ్డు ఏరియా, అక్కయ్యపాలెం ప్రధాన రహదారి, శ్రీనివాసనగర్ ఏరియా, నందగిరి నగర్ వినియోగదారులు సహకరించాలని కోరారు. అలాగే.. నిర్వహణ పనులు చేపడుతున్నందున శంకువానిపాలెం, సరోజిని హాస్పిటల్, చిన్నూరు, జీవీఎంసీ ఉన్నత పాఠశాల ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కన్యకాపరమేశ్వరికి సామూహిక వ్రతాలు



వ్రతాల్లో పాల్గొన్న మహిళలు



అలంకరణలో శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారు

మహారాణిపేట, ఆగస్టు 16: వన్‌టౌన్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు, వ్రతాలు అత్యంత వైభవంగా జరిగాయి. శ్రావణ మాసం రెండవ శుక్రవారం వరలక్ష్మి వ్రతం సందర్భంగా అమ్మవారికి తేనె, గంధం, పసుపు కుంకుమ, పండ్ల రసాలు 108 ద్రవ్యాలతోపాటు క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం పట్టు వస్త్రాలతో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. వివిధ రకాల పుష్పాలు, పసుపు కొమ్ములు, గాజులతో తీర్చిదిద్ది పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. మహిళలతో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.

డీఎస్సీలో సీఆర్పీలకు వెయిటేజీ ఇవ్వాలి

» ప్రభుత్వానికి సమగ్ర శిక్ష జిల్లా జేఏసీ ప్రతినిధులు విజ్ఞప్తి

కంచరపాలెం, ఆగస్టు 16 : త్వరలో నిర్వహించనున్న డీఎస్సీ -2024 లో సమగ్ర శిక్షలో పనిచేస్తున్న సీఆర్పీలకు వెయిటేజీ కల్పించాలని ఉద్యోగుల జిల్లా జేఏసీ నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సమగ్ర శిక్ష కాంట్రాక్టు &అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల విశాఖ జిల్లా జేఏసీ ప్రతినిధులు పి.గణపతి, ఎల్. చైతన్య శుక్రవారం స్థానిక బీఎస్ఆర్ భవనంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ, సమగ్ర శిక్షలో గత 12 ఏళ్లుగా బీఈడీ, టెట్ పరీక్షలు ఉత్తీర్ణత సాధించి చాలీచాలని జీతాలతో ఉద్యోగాలు చేస్తున్న సీఆర్పీలకు వెయిటేజీ ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. గతంలో ఐఈఆర్టీ టీచర్లు, అగ్రికల్చర్ తదితర విభాగాలకు వెయిటేజీ ఇచ్చిన ప్రభుత్వం విద్యాశాఖలో కీలక విధులు చేపడుతున్న సీఆర్పీలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు పార్టుటైం ఇన్‌స్ట్రక్టర్లతో పాటు అర్హులైన ఇతర విభాగాల వారికి వెయిటేజీను ప్రకటించి న్యాయం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కోరారు.

శెట్టిబలిజ అసోసియేషన్ కార్యవర్గం



చిన్నారికి బహుమతి అందిస్తున్న ప్రతినిధులు

మహారాణిపేట, ఆగస్టు 16: గొల్లలపాలెం శెట్టిబలిజ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. పాత జైలు రోడ్డు న్యూ రామాలయంలో అసోసియేషన్ 53వ వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడు పితాని నందకుమార్, అధ్యక్షుడిగా బత్తిన దంతేశ్వరరావు, ప్రధాన ప్రధాన కార్యదర్శిగా నాగుల సన్యాసిరావు కోశాధికారిగా కోన్ను శ్రీనివాస్ నియమితులయ్యారు. అనంతరం స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా పలువురికి బహుమతులు అందించారు.

వైభవంగా దుర్గాగణపతి ఆలయ వార్షికోత్సవం



ఉత్సవ పల్లకిని మోస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

సీతంపేట, ఆగస్టు 16: సీతంపేట ప్రధాన రహదారిలోని దుర్గాగణపతి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. 20వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో అర్చకులు నటరాజన్ దుర్గాగణపతికి పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలు, జలాలతో అభిషేకాలు, పూజలు చేశారు. ముఖ్య అతిథిగా నార్త్ ఎమ్మెల్యే, బీజేపీ ఫ్లోర్‌లీడర్ పి.విష్ణుకుమార్‌రాజు విచ్చేసి దుర్గాగణపతికి పూజలు నిర్వహించారు. అనంతరం దుర్గాగణపతి పల్లకి ఉత్సవంలో పాల్గొని ఎమ్మెల్యే పల్లకిని మోశారు.

నందగిరి నగర్‌లో ఉచిత వైద్య శిబిరం

అక్కయ్యపాలెం, ఆగస్టు 16 : గ్రేటర్ 44వ వార్డు నందగిరి నగర్‌లో లక్ష్మీ గాయత్రి హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ మేరకు స్థానికులకు హాస్పిటల్ ఎండీ కె.వెంకటరామ్‌కుమార్ వైద్య పరీక్షలు చేసి ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందగిరినగర్‌లో గత ఐదేళ్లుగా ప్రతి నెలా ఉచిత మెగా వైద్య శిబిరాన్ని కొనసాగిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమేష్, సిబ్బంది కోటి, ఈశ్వరరావు, సురేష్, సుజాత, నందగిరినగర్ సేవా సంఘం గౌరవాధ్యక్షుడు జయకుమార్, ఉపాధ్యక్షుడు గేదెల వెంకన్న, కార్యదర్శి బసవ గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

రాక్‌ట్రీ పనులపై విజిలెన్స్ తనిఖీలు

» పనికంటే ఎక్కువ బిల్లుల చెల్లింపులపై ఆరా

విశాఖపట్నం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు నగర శివారు ప్రాంతాల్లో రాక్‌ట్రీ ఇన్‌ఫ్రా కంపెనీ చేపట్టిన ఇళ్ల నిర్మాణాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులుతనిఖీలు చేపట్టారు. చేపట్టిన నిర్మాణాలు కంటే ఎక్కువగా చెల్లింపులు చేశారన్న ఆరోపణలతో తనిఖీలకు ప్రభుత్వం ఆదేశించింది. దీంతో శుక్రవారం సబ్బవరం మండలం గొల్లలపాలెం, పైడివాడ అగ్రహారం, నంగినారపాడు, పెదగంట్యాడ మండలం నడుపూరులో కాలనీలను విజిలెన్స్ అధికారులు పరిశీలించారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో పలు చోట్ల ఇళ్ల నిర్మాణ బాధ్యతలను కొన్ని సంస్థలకు అనధికారికంగా అప్పగించారు. జిల్లాలో సుమారు లక్ష ఇళ్ల నిర్మాణాలను చేపట్టిన కంపెనీల్లో అనంతపురం జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే సొంత కంపెనీ రాక్‌ట్రీ ఇన్‌ఫ్రా ఉంది. నిర్మాణాలు చేపట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించింది. తొలుత 35వేలకు పైగా ఇళ్ల నిర్మాణ బాధ్యతలను అప్పగించగా లక్ష్యాలను అనుగుణంగా పనులు చేపట్టలేదు. దీంతో కోత వేశారు. చివరికి 11,575 ఇళ్లు మాత్రమే అప్పగించారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో నిర్మాణాలపై ప్రభుత్వం విచారణకు సిద్ధమైంది. రాక్‌ట్రీ ఇన్‌ఫ్రాకు చేసిన పనుల కంటే ఎక్కువ చెల్లింపులు చేశారన్న ఫిర్యాదుల నేపథ్యంలో తనిఖీకి ఆదేశించింది.నాలుగు కాలనీల్లో మొత్తం 11,575 ఇళ్లలో ఇంతవరకు 4,744 ఇళ్లకుపూర్తిస్థాయిలో పునాదులు వేశారు. మరో 5,969కు అడుగు ఎత్తులో పునాది నిర్మించగా, 305 ఇళ్ల పునాదులకు గోతులు, 130 ఇళ్లకు కోలమ్స్, 28 ఇళ్ల కిటికీల ఎత్తు, 165 స్లాబ్ వరకు, 137 ఇళ్లకు స్లాబ్‌లు పూర్తిచేశారు. సిమెంట్, ఇనుము, ఇసుక మినహాయించిరూ.35,64,98,617 రాక్‌ట్రీ ఇన్‌ఫ్రాకు ఇచ్చారు.

'జిల్లా ప్రధాన న్యాయమూర్తిని బదిలీ చేయాలి'

సిరిపురం, ఆగస్టు 16: జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్‌ను తక్షణమే బదిలీ చేయాలని విశాఖ న్యాయవాదుల సంఘం డిమాండ్ చేసింది. ఈమేరకు శుక్రవారం వారు రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశారు. బెంచ్‌పై నుంచి న్యాయమూర్తి ప్రవర్తన సరిగ్గా లేదని, కేసుల విచారణ సమయంలో అసలైన విషయాలు పక్కనపెట్టి న్యాయవాదుల పట్ల అభ్యంతకరమైన వ్యాఖ్యలతో ప్రవర్తిస్తున్నట్టు లేఖలో ఆరోపించారు. అలాగే జిల్లా కోర్టులో దాఖలైన కేసుల్లో చిన్న చిన్న ఆరోపణల నెపంతో కేసులను విచారణకు స్వీకరించకుండా న్యాయవాదులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెప్పారు.

పర్యావరణ పరిరక్షణపై వర్క్‌షాపు

సీతంపేట, ఆగస్టు 16: ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా పర్యావరణ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో శుక్రవారం ఒక్క రోజు వర్క్‌షాపును నిర్వహించారు. ఏయూ ప్రొఫెసర్ వీహెచ్ శైలజ, పర్యావరణ నెట్‌వర్క్ కన్వీనర్‌కె.విజయబాబు,మేనేజర్‌ఎస్.రవికుమారి,స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు ఉన్నారు.

నేడు వైద్య సేవలు బంద్

... 3వ పేజీ తరువాయి

ఆస్పత్రులతోపాటు ప్రైవేటు హాస్పిటల్స్, నర్సింగ్ హోమ్స్, క్లినిక్స్‌లో కూడా 24 గంటలపాటు సేవలను నిలిపివేయనున్నారు. అత్యవసర వైద్య సేవలు, శస్త్ర చికిత్సలను మాత్రం నిర్వహిస్తామని ఐఎంఏ ప్రకటించింది.

నిరసన కార్యక్రమాలు

జూనియర్ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో శనివారం రిలే నిరాహార దీక్షలు ప్రారంభించనున్నారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు దీక్షలు నిర్వహిస్తారు. ఉదయం మానవహారం, ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి రైల్వే స్టేషన్ మీదుగా జీవీఎంసీ కార్యాలయం ఎదుటగల గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహిస్తారు. వైద్య విద్యార్థినికి జరిగిన అన్యాయంపై ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేయనున్నట్టు జూనియర్ వైద్యులు సంఘం సలహాదారు జహంగీర్ పేర్కొన్నారు. కోల్‌కతాలో మృతిచెందిన వైద్య విద్యార్థినికి న్యాయం జరిగేంత వరకు తమ నిరసన కొనసాగుతుందన్నారు. నిందితులను తక్షణమే ఉరి తీయాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో ప్రభుత్వ ఆస్పత్రులు

జూనియర్ వైద్యులతోపాటు ప్రభుత్వ వైద్యుల సంఘం కూడా బంద్‌కు మద్దతు తెలిపిన నేపథ్యంలో ఆంధ్ర మెడికల్ కళాశాల పరిధిలోని కేజీహెచ్, ఘోషా, ఈఎన్‌టీ, ఛాతీ, అంటువ్యాధుల ఆస్పత్రి, ప్రాంతీయ కంటి ఆస్పత్రి, మానసిక వైద్యశాల, విమ్స్‌లో రోగులు ఇబ్బందులు పడకుండా అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. కేజీహెచ్‌లో క్యాజువాల్టీ సేవలు అందించేందుకు 16 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, 26 మంది ప్రీ పారామెడికల్ డాక్టర్లు, ఓపీ విభాగాలు నిర్వహించేందుకు అనుగుణంగా ఆయా విభాగాలకు చెందిన ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లను ఏర్పాటుచేశారు. అత్యవసర శస్త్రచికిత్సల నిర్వహణకు ఇబ్బందులు లేకుండా 28 మంది అనస్థీషియన్‌లను అందుబాటులో ఉండాలని ఆదేశించారు. సెలవులు రద్దు చేసినట్టు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద తెలిపారు. విమ్స్‌లో కూడా మొత్తం 30 మంది వైద్య నిపుణుల బృందాన్ని అందుబాటులో ఉంచినట్టు డైరెక్టర్ డాక్టర్ రాంబాబు తెలిపారు.

భూ అక్రమాలపై ఉక్కుపాదం

... 3వ పేజీ తరువాయి

ఉన్నతాధికారులు ఆనందపురం, భీమిలి, పద్మనాభం, పెందుర్తి మండలాల్లో డిపట్టా భూముల రైతులతో మాట్లాడుకుని అడ్వాన్స్‌లు ఇచ్చారు. ఈ విషయంలో స్థానికంగా ఉన్న వైసీపీ నేతలు, కొందరు అధికారులు దళారులుగా వ్యవహరించారు. అలా వైసీపీ పెద్దలు, ఉన్నతాధికారులు ఒప్పందాలు కుదుర్చుకున్న భూములకు మాత్రమే ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు జారీచేశారు. గత ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన ఒకరు ఎక్కువ భూములకు అడ్వాన్స్ ఇచ్చారు. మాజీ ఉన్నతాధికారి ప్రమేయంతో త్రిలోక్, సుభాష్ అనే ఇద్దరు ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్ల జారీలో కీలకపాత్ర పోషించారు. అధికారికసమాచారం మేరకు జిల్లాలో 623 ఎకరాలకు ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్లు జారీచేయగా దాంట్లో 129 ఎకరాలు రైతుల నుంచి వేరే వ్యక్తులకు రిజిస్ట్రేషన్ జరిగింది. ఇంకా మరికొన్ని భూములకు అగ్రిమెంట్లు జరిగినా ఎన్నికలు రావడం తరువాత ప్రభుత్వంమారడంతోఫ్రీహోల్డ్ సర్టిఫికెట్ల జారీ, రిజిస్ట్రేషన్ నిలిచిపోయాయి.

ల్యాండ్ పూలింగ్‌లో అవకతవకలు

జగనన్న కాలనీల పేరిట జిల్లాలోని ఆనందపురం, పద్మనాభం, పెందుర్తి, భీమిలి, పెదగంట్యాడ మండలాల్లో సుమారు 4,600 ఎకరాలు సమీకరించారు. అయితే ఆ భూములకు ఆనుకుని ఉన్న కొన్ని డీపట్టా భూములను గత ప్రభుత్వ పెద్దలు అనధికారికంగా కొనుగోలు చేశారనే ఆరోపణలున్నాయి. ఇంకా ల్యాండ్ పూలింగ్‌కు భూములు ఇచ్చిన రైతులకు ఎకరాకు 900/450/250 గజాల వంతున అభివృద్ధి చేసిన ప్లాట్లుకేటాయించాలని నిర్ణయించారు. రైతులకు ఇవ్వనున్న ప్లాట్లను ముందుగానే కొందరు వైసీపీ పెద్దలు తక్కువ రేటుకు కొనుగోలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి.

22-ఎ నుంచి పలు భూములు మినహాయింపు?

22-ఎలో పొందుపరిచిన భూముల్లో కొన్నింటికి గత ప్రభుత్వంలో మినహాయింపు ఇచ్చారు. కొమ్మాది, పరదేశిపాలెం, పీఎం పాలెం, మధురవాడ, కాపులుప్పాడ, భీమిలి, సాగర్‌నగర్, ఆనందపురం ప్రాంతాల్లో మాజీ సైనికులు, స్వాతంత్ర్య సమర యోధులు, పొలిటికల్ సఫరర్లకు ఇచ్చిన భూములకు ఎన్‌వోసీ ఇచ్చి..తరువాత 22-ఎ నుంచి తప్పించారు. మధురవాడ, పీఎం పాలెం ప్రాంతాల్లో ఎన్‌వోసీ ఇచ్చిన భూముల చుట్టూ కొందరు పెద్దలు ఫెన్సింగ్ వేసి నిర్మాణాలు చేపడుతున్నారు. నగరంలో దసపల్లా భూములను 22-ఎ నుంచి తప్పించారు. సర్క్యూట్ హౌస్‌కు ఆనుకుని మరో ఐదెకరాలను 22-ఎ నుంచి తప్పించారు. ఇంకా ఎండాడ సర్వే నంబర్ 171లో ఎక్స్‌సర్వీస్‌మెన్‌కు కేటాయించిన ఐదెకరాలకు ఎన్‌వోసీ ఇచ్చిన తరువాత 22-ఎ నుంచి మినహాయించారన్న ఆరోపణలు ఉన్నాయి. గడచిన ఐదేళ్లలో 22-ఎ నుంచి తప్పించిన భూముల వివరాలు బయటపెడితే వాటిలో అక్రమాలు వెలుగులోకి వస్తాయని పలువురు కోరుతున్నారు.

స్టీల్‌ప్లాంటు విలవిల

... 3వ పేజీ తరువాయి

వృథా అవుతోంది. ఒక టన్ను స్టీల్ తయారీకి 500 టన్నుల బొగ్గు అవసరం కాగా గత కొంత కాలంగా 580 టన్నుల బొగ్గు వాడుతున్నారు. అదనంగా 80 టన్నులు పడుతోంది. ఈ వృథాను లెక్కిస్తే ఏడాదికి రూ.700 కోట్లు అదనపు భారం పడుతోందని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ కన్వీనర్ అయోధ్యరామ్ ఆరోపించారు. ముడి సరకులు లేక స్టీల్‌ప్లాంటులో ఉత్పత్తి ఆగిపోతున్నదని, దేశంలో ఇలాంటి దుస్థితి ఏ ప్లాంటుకూ లేదని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకొని ప్లాంటును పూర్తిస్థాయిలో నడిచేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

టీడీఆర్ హబ్‌పై విచారణ

... 3వ పేజీ తరువాయి

ద్వారా, మరికొందరు ఎగ్జిక్యూటివ్ కోటాలో ప్రవేశాలు పొందారు.ప్రవేశాలకు సంబంధించి అనుసరించిన నిబంధనలను కూడా పరిశీలించి నివేదిక అందించనున్నారు. టీడీఆర్ హబ్‌లోని గైడ్ల వ్యవహారంపై ప్రస్తుతం విచారణ సాగుతుండడంతో 2024-25 ఏడాదికి సంబంధించి పీహెచ్‌డీ ప్రవేశాలను వర్సిటీ ఉన్నతాధికారులు నిలిపి వేశారు. ఆర్‌సెట్ కన్వీనర్ టీడీఆర్ హబ్‌కు 172 పీహెచ్‌డీ సీట్లను కేటాయిస్తామని చెప్పినప్పటికీ..విచారణ పూర్తయ్యేంత వరకు వద్దని చెప్పినట్టు వీసీ ప్రొఫెసర్ జి.శశి భూషణరావు వెల్లడించారు. ఈ వ్యవహారంపై నివేదిక వచ్చిన తరువాత అడ్మిషన్లు తీసుకుంటామన్నారు.

నేడు 3, 4 జోన్‌లలో తాగునీటి సరఫరాకు అంతరాయం

వెంకోజీపాలెం, ఆగస్టు 16 : గ్రేటర్ పరిధిలోని మూడు, నాలుగు జోన్లలో పలు ప్రాంతాలకు శనివారం తాగునీటి సరఫరా నిలిపివేయనున్నట్టు జీవీఎంసీ పర్యవేక్షక ఇంజనీర్ రవి తెలిపారు.శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జీవీఎంసీ టీఎస్సార్ నుంచి హైలెవెల్ రిజర్వాయర్‌కి వచ్చే ప్రధాన మంచినీటి సరఫరా పైపులైన్ మరమ్మతు పనుల దృష్ట్యా 20వ వార్డులో ఈస్ట్‌పాయింట్ కాలనీ, పెదవాల్తేరు, 21వ వార్డులో తమిళవీధి, విద్యానగర్‌కాలనీ, రెల్లివీధి, ఏయూ అవుట్ గేట్ డౌన్, ఓల్డ్ సీబీఐ డౌన్, మైత్రీనగర్, వినాయగర అపార్టుమెంట్, స్విమ్మింగ్ పూల్ ఏరియా, పాండురంగాపురం, బీచ్ రోడ్డు సబ్ మెరైన్, ఓషన్ వ్యూ లేఅవుట్ ఏరియా, చినవాల్తేరు, 22వ వార్డులో బాలాజీనగర్, టైమ్స్ ఆఫ్ ఇండియా,సిద్దార్థనగర్ ప్రాంతాలకు నీటి సరఫరా ఉండదన్నారు. అలాగే 24వ వార్డులో పాత రేసపువానిపాలెం, వినాయకనగర్, తులసిపేట, స్వర్ణభారతి స్టేడియం ఏరియా, 27వ వార్డు అశోక్‌నగర్, రామాటాకీస్ రోడ్డు, శ్రీనగర్, బుదిల్ పార్కు రోడ్డు, రెడ్డి ఆస్పత్రి రోడ్డు, శ్రీనగర్ సాయిబాబా టెంపుల్ రోడ్డు, ద్వారకానగర్ రోడ్డు నెం.1 నుంచి 6వ లైన్ వరకు, అమర్‌నగర్ చర్చ్ రోడ్డు, సీబీఎం కాంపౌండ్, రామాటాకీస్ లేడీస్ గేట్ బుకింగ్ రోడ్డు, 28వ వార్డు ఫాకర్స్ లేఅవుట్, కైలాస మెట్ట, రామ్‌నగర్ ప్రాంతాలకు తాగునీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. తాగునీటి సమస్య ఎక్కువగా ఉన్నచోట ట్యాంకర్లతో నీరు సరఫరా చేస్తామన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆనందపురం, ఆగస్టు 16 : మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ నిర్వహణ పనుల దృష్ట్యా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ సురేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రామవరం, కణమాం, ఎర్రవానిపాలెం, గొరింట, బోయపాలెం, గంభీరం, కొత్తకల్లివానిపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని సూచించారు.

కమనీయం.. అప్పన్న నిత్య కల్యాణం



సింహాచలం, ఆగస్టు 16 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత నిత్య కల్యాణం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ధూపసేవ, బాలభోగ నివేదనం వంటి ప్రభాతారాధనలు జరిపారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేసి భక్తుల గోత్రనామాలతో సంకల్పించారు. విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు.అనంతరం కల్యాణ క్రతువు జరిపారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, ప్రసాదాలు అందజేశారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ. 2 లక్షల విరాళం

వరాహలక్ష్మీనృసింహస్వామి నిత్యాన్న ప్రసాద పథకానికి నగరానికి చెందిన వేమూరి రమేష్‌బాబు రూ. 2 లక్షలు విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తం రూ.2,01,116లను చెక్ రూపంలో అన్నప్రసాద విభాగం ఇన్‌చార్జి ఏఈఓ పాలూరి నరసింగరావుకు శుక్రవారం అందజేశారు. ఆలయ ప్రకారం దాత కుటుం బ సభ్యులకు అధికారులు స్వామివారి అంతరాలయ దర్శనం కల్పించి, వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

ఉచిత వైద్య శిబిరం రేపు

పద్మనాభం, ఆగస్టు 16 : పద్మనాభం గ్రామ సచివాలయం వద్ద విజయనగరం క్వీన్ ఎన్ఆర్ఐ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం జరగనుంది. ఈమేరకు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు జరిగే ఈ శిబిరంలో వైద్యులు రోగులను పరీక్షించి మందులు అందజేస్తారు.

సినిమా గైడ్

- **తంగలాన్ :** శారద, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి).
- **మిస్టర్ బచ్చన్ :** కామేశ్వరి, మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సుకన్య (గోపాలపట్నం), కన్య, విశేష్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం).
- **ఆయ్ :** రమాదేవి, వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీనరసింహ (గోపాలపట్నం).
- **కమిటీ కుర్రోళ్లు :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక),
- **తుఫాన్ :** జగదాంబ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ (104 ఏరియా),నరసింహ(గోపాలపట్నం),శ్రీకన్య-1(గాజువాక), ,అరుణ (పెదగంట్యాడ).
- **భవనమ్ :** లక్ష్మి (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి),
- **సింబా :** జగదాంబ, మోహిని (గాజువాక)
- **సంఘర్షణ :** క్రాంతి
- **శివం భజే :** లక్ష్మీకాంత్ (గాజువాక)
- **రాయన్ :** సంగం, శ్రీకన్య-2 (గాజువాక)
- **కల్కి :** శ్రీరామ, సప్తగిరి(తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 42, టమాటా 26, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 52, బెండకాయలు 20, పచ్చిమిర్చి 54, కాకరకాయలు 34, బీరకాయలు 34, ఆనపకాయలు 16, కాలీఫ్లవర్ 38, క్యాబేజి 26, క్యారెట్ 28, దొండకాయలు 36, బంగాళదుంపలు 37, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 38, అల్లం (పాతది) 130, బరబటి 28, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 82, గోరుచిక్కుడు 36, దోసకాయ 22, వెల్లుల్లి (పెద్దవి) 195, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 56, పొటల్స్ 34, కీరదోస 30, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 44, చిలగడదుంపలు 44, కంద 58, దేముడు చిక్కుడు 84, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	495
విజయనగరం	499
శ్రీకాకుళం	499

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	83
ఫారం ధర	--	103
విత్ స్కిన్	--	176
స్కిన్‌లెస్	--	186

మరికొన్ని సిటీ వార్తలు | పేజీ 8 లో..



బీఆర్ తాళ్లవలసలో దమ్ము పట్టిన పొలం



కృష్ణాపురం కాలువ కింద నాట్లు వేసిన పొలాలు

ముమ్మరంగా ఖరీఫ్ పనులు

- పద్మనాభంలో 60 శాతం నాట్లు పూర్తి
- మిగిలిన చోట్ల కొనసాగుతున్న పనులు
- సాగునీటి వనరులు కళకళ

పద్మనాభం, ఆగస్టు 16 : మండలంలో ఖరీఫ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రస్తుతం 60 శాతం వరి నాట్లు పూర్తయ్యాయి. ఈఏడాది 6400 ఎకరాల్లో వరి వేయాల్సి ఉండగా ఇప్పటివరకు 3808 ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయి. ఇప్పటికే మద్ది, బాందేవుపురం, అనంతవరం, గంధవరం, పెంట, తునివలస, నేరేళ్లవలస, చిన్నాపురం తదితర గ్రామాల్లో నాట్లు వేశారు. ఈ ఏడాది వర్షాలు జూన్‌లో సాధారణ వర్షపాతం 156.4 మి.మీ కాగా 238 మి.మీ, జూలైలో 171.7 మి.మీకు 248.3 మి.మీ. వర్షం కురిసింది. అధిక వర్షపాతంతో రైతులు సకాలంలో నారు వేసుకోవడంతో పాటు కొన్ని గ్రామాల్లో నాట్లు కూడా వేసుకోగలిగారు. ఆగస్టులో అడపాదడపా కురుస్తున్నా వర్షాలకు చెరువులు నిండలేదు. ఈనెలలో 263.4 మి.మీ వర్షం కురవాల్సి ఉండగా ఇప్పటివరకు కేవలం 80.6 మి.మీ వర్షం మాత్రమే కురిసింది. దీంతో అయినాడ, బీఆర్ తాళ్లవలస, వెంకటాపురం గ్రామాల్లో చెరువులు నిండకపోవడంతో సాగునీటి వసతి లేక ఇప్పటికీ నాట్లు వేయలేకపోయారు. మద్ది, కృష్ణాపురం, కుర్రపల్లి ఆనకట్టకు అనుబంధంగా ఉన్న కాలువల కింద భూములు ఉన్న కృష్ణాపురం, పొట్నూరు, రేవిడి, పాండ్రంగి తదితర గ్రామాలతో పాటు చెరువు ఆయకట్టు ఉన్న రెడ్డిపల్లి కొవ్వాడ, విలాస్‌ఖాన్‌పాలెం తదితర గ్రామాల్లో కొంతవరకు వరినాట్లు వేశారు.నాలుగేళ్లుగా అతివృష్టి, అనావృష్టి పరిస్థితులతో అవస్థలు పడిన రైతాంగం ఈఏడాది ప్రారంభంలో కురిసిన వర్షాలతో సకాలంలో పంటలు పండించుకోవచ్చని ఆశించారు. కానీ ఈనెల 15 రోజులు దాటినా సాధారణ వర్షపాతంలో మూడోవంతు కూడా కురవకపోవడంతో కర్షకులు ఆందోళన చెందుతున్నారు. దీనికితోడు గత వైసీపీ ప్రభుత్వం సాగునీటి చెరువుల రక్షణకు ఐదేళ్లు ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయింది. చెరువు వద్ద ఉన్న తూములు, కాలువలు కూడా నిర్వహణ సరిగా లేక పాడయ్యాయి. పొట్నూరు నూకాంబికా, పాండ్రంగి కాటయమయ్య రేవిడి యానాద్రి కోరాడ కృష్ణమస్, మద్ది రాజు - వెంకటపతిరాజు, రెడ్డిపల్లి , బీఆర్ తాళ్లవలస, అయినాడ గ్రామాల్లోని చెరువులు నీటి నిల్వ సామర్థ్యాన్ని కోల్పోయాయి.

ఆలయాల్లో శ్రావణ పూజలు

సింహాచలం, ఆగస్టు 16 : శ్రావణ మాసం రెండో శుక్రవారం పురస్కరించుకుని వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శ్రావణ మహాలక్ష్మికి లక్ష కుంకుమార్చన నిర్వహించారు. వేకువజామున సుప్రభాత, ప్రభాతారాధనలు ముగిసిన తరువాత సువర్ణ, చతుర్భుజి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆలయ బేడామండపంలో సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో ప్రధానార్చకుడు వెంకటరమణాచార్యులు సారథ్యంలో భక్తుల గోత్రనామాలతో సంకల్పించారు. విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు తరువాత షోడశోపచారాలు సమర్పించారు. ప్రధానార్చకుడు లక్ష్మీ సహస్రనామావళి పఠి స్తుండగా పదిమంది వైదికులు సింహవల్లీ తాయార్, ఇతర అమ్మవార్ల వద్ద కుంకుమార్చన చేశారు.సాయంత్రం కూడా అమ్మవారికి ఆర్జిత సేవగా సహస్రనామార్చన జరిపారు. అలాగే కొండ దిగువ పూదోటలోని అలిమేలుమంగా,పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి సన్నిధిలో కూడా అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన నిర్వహించారు. సూర్యోదయానికి ముందే సుప్రభాత సేవ, ప్రభాత ఆరాధనలు చేసి అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేక వేదికపై ఉంచారు. భక్తుల గోత్రనామాలతో శ్రీకారం చుట్టి సహస్రనామావళితో కుంకుమార్చన చేసి మంగళనీరాజనాలిచ్చారు.



సింహగిరిపై మహాలక్ష్మికి కుంకుమార్చన చేస్తున్న వైదికులు

కొమ్మాది : అన్నంరాజునగర్‌లోని అష్టలక్ష్మీ దేవాలయానికి భక్తులు పోటెత్తారు. వేకువజామున అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపిన అనంతరం మహాలక్ష్మీ హోమం నిర్వహించారు. అనంతరం లక్ష్మీనారాయణులకు వజ్ర కవచధారణతో అలంకరించి భక్తులకు దర్శనాలు కల్పించారు.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ ధర్మకర్తలు అన్నంరాజు సత్యనారాయణ, రమాదేవి దంపతులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆలయంలోని వైశాఖేశ్వర స్వామికి కూడా ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. చంద్రంపాలెం జాతర గుట్టపై ఉన్న దుర్గాలమ్మ ఆలయంలో మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, నాగోతి తాతారావు పాల్గొన్నారు.

వెంకోజీపాలెం : కొత్తవెంకోజీపాలెంలోని రామానంద ఆశ్రమం గౌరీ జ్ఞానలింగేశ్వరాలయ దేవస్థానంలో వేంచేసి ఉన్న రాజరాజేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు ప్రకాశ్ శర్మ, సుబ్రహ్మణ్య శాస్త్రి, భాస్కర్ శర్మ భక్తుల గోత్ర నామాలతో అర్చనలు చేసి, కుంకుమాభిషేకాన్ని జరిపారు. అలాగే హెచ్‌బీకాలనీలోని అంబికామాత ఆలయం, బహుముఖ గాయత్రి ఆలయంలో మహిళలు లలితా సహస్రనామాలు పఠించారు. అర్చకుడు వేణుగోపాల శర్మ ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి.



భీమిలి : కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో కరెన్సీ నోట్లతో అమ్మవారి అలంకరణ

రూ. 2 లక్షలతో అమ్మవారికి అలంకరణ

భీమునిపట్నం : పట్టణంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో వరలక్ష్మీదేవిని ఆలయ ప్రధానార్చకుడు అప్పలాచార్యులు ఆధ్వర్యంలో రూ. 2 లక్షల కరెన్సీ నోట్లతో అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, నాయకులు రేలంగి పెదబాబు, కంటుభుక్త ముత్యాలరావు పాల్గొన్నారు.

పద్మనాభం : పద్మనాభంలోని కుంతీమాధవ స్వామి ఆలయంలో కొలువై ఉన్న లక్ష్మీదేవికి విశేష అలంకరణలతో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం కుంకుమ పూజలతో పాటు నామ సంకీర్తన నిర్వహించారు. గెద్దపేటలోని లక్ష్మీ గణేశ సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలోని అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు.

వైభవంగా అమ్మవార్ల తిరువీధి

సింహాచలం, ఆగస్టు 16 : వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో శుక్రవారం సాయంత్రం బేడా మండప తిరువీధి వైభవంగా నిర్వహించారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా ఉదయం, సాయంత్రం సహస్రనామ కుంకుమార్చనలు జరిపారు. అనంతరం సువర్ణ అమ్మవారు, సింహవల్లీ తాయారు అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకిలో ఉంచి ఆలయ విద్వాంసులు నాదస్వరాలాపనలు చేస్తుండగా, పండితులు వేద పఠనాలు కావించగా బేడా మండంపలో తిరువీధి జరిపారు.



తిరువీధిలో అమ్మవార్లు

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం స్విచ్ బోర్డు

పద్మనాభం (రూరల్), ఆగస్టు 16 : మండలంలోని కృష్ణాపురం గ్రామంలో వాటర్ ట్యాంక్ సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభానికి ఏర్పాటు చేసిన మినీ ట్రాన్స్‌ఫార్మర్ మెయిన్ స్విచ్ బోర్డుకు ఎలాంటి రక్షణ లేక ప్రమాదకరంగా ఉంది. దీంతో అటువైపుగా రాకపోకలు చేసే ప్రజలు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. ప్రమాదకరంగా ఉన్న స్విచ్ బోర్డును సరిచేయాలని స్థానికులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా.. ఎవరూ పట్టించుకోవడం లేదు.



ఐదు రోజులుగా కుళాయిలు రాక ఇక్కట్లు

వెంకోజీపాలెం, ఆగస్టు 16 : గ్రేటర్ పరిధిలోని 16వ వార్డు పాత వెంకోజీపాలెంలో ఐదు రోజులుగా కుళాయిల నుంచి మంచినీటి సరఫరా జరగక స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఐదు రోజుల క్రితం గొల్లవీధిలో నూతనంగా వేసిన ఓపెన్ పైపులైన్‌కు కనెక్షన్ కలిపే ప్రక్రియలో భాగంగా ఈ ప్రాంతంలో తాగునీటి సరఫరాకు అంతరాయం కలిగింది. నూతన పైపులైన్ ఎగువ ప్రాంతంలో ఉన్న పైపులైన్‌కు తగిలించారు. కానీ దిగువ ప్రాంతంలో వీధి చివర ఉన్న కుళాయిలకు మాత్రం నూతన పైపులైన్ కనెక్షన్ కలపలేదు. దీంతో ముందు మూడు రోజులు పూర్తిగా నీటి సరఫరా జరగలేదు. రెండు రోజుల నుంచి సన్నటి ధార మాత్రమే వస్తుండడంతో ఆ నీటిని పట్టుకునేందుకు మహిళలు గంటల తరబడి వేచి ఉంటున్నారు. ఇక్కడ కూడా నూతన పైపులైన్‌కు కనెక్షన్ కలిపి, నీటి సరఫరా పూర్తి స్థాయిలో జరిగేలా చూడాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

వీసీని కలిసిన రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు

వెంకోజీపాలెం, ఆగస్టు 16 : ఏయూ వీసీ ఆచార్య జి. శశిభూషణరావును రాష్ట్ర బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ ఎస్. కృష్ణమోహన్ శుక్రవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతో పాటు విశాఖ బార్ అసోసియేషన్ న్యాయవాది పి. సురేష్ కూడా ఉన్నారు.

ఫుడ్ క్రాఫ్ట్ ఇనిస్టిట్యూట్‌ను సందర్శించిన కేంద్ర బృందం



సమావేశంలో పాల్గొన్న రక్షణ మంత్రిత్వ శాఖ జాయింట్ కార్యదర్శి హరి ప్రసాద్

ఆరిలోవ, ఆగస్టు 16 : చినగదిలి తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలో ఉన్న ఫుడ్ క్రాఫ్ట్ ఇనిస్టిట్యూట్‌ను డిల్లీకి చెందిన కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ పూడి హరిప్రసాద్ బృందం శుక్రవారం సందర్శించింది. ఈ సందర్భంగా వారు సంబంధిత శాఖ విద్యార్థులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం హరి ప్రసాద్ మాట్లాడుతూ డిఫెన్స్‌లో పని చేసి పదవీ విమణ తరువాత కేటరింగ్ వృత్తి విద్య ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ స్కూల్ ఆఫ్ డిఫెన్స్ స్టడీస్ అనుబంధ ప్రొఫెసర్ డాక్టర్ ఉజ్వల కుమార్, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పద్మనాభం, ఆగస్టు 16 : ప్రమాదంలో గాయపడిన మహిళ మృతిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్టు పద్మనాభం పోలీసులు చెప్పారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం.. కొయ్యపేట గ్రామానికి చెందిన జంకల రాములమ్మ (45) ఈ నెల 13న రాత్రి కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఇంటి బయటకు వెళ్లి రోడ్డు దాటి వస్తుండగా బైక్‌పై వస్తున్న గుర్తు తెలియని వ్యక్తి ఢీకొన్నాడు. దీంతో ఆమె తలకు బలమైన గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను విజయనగరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అక్కడి నుంచి ఈనెల 15న విజయనగరం మహారాజా ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి అల్లుడు పైడినాయుడు ఫిర్యాదు మేరకు వాహనదారుడిపై హెచ్‌సీ ఆనందరావు కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారకుడయిన వ్యక్తి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ఇస్కాన్‌లో 24 నుంచి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

సాగర్‌నగర్, ఆగస్టు 16 : ఇస్కాన్ మందిరంలో ఈనెల 24 నుంచి 27 వరకు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించనున్నట్టు ఇస్కాన్ విశాఖపట్నం అధ్యక్షుడు సాంబదాసు తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వ్యాసరచన, డ్రాయింగ్, కృష్ణలీలలపై పరీక్ష, భగవద్గీత శ్లోక పారాయణాలు, పూల అలంకరణ, రంగోలి తదితర పోటీలు వుంటాయన్నారు. వివరాలకు 9441792704, 6305952060, 9945504309 ఫోన్ నంబర్లను సంప్రతించాలని ఆయన సూచించారు.


యువ వైద్యురాలి మృతి పట్ల సంతాపం

వెంకోజీపాలెం, ఆగస్టు 16 : కోల్‌కత్తాలోని ఆర్‌జీ కార్ ఆసుపత్రిలో యువ వైద్యురాలిపై జరిగిన అత్యాచార, హత్య సంఘటనపై మెడికవర్ ఆసుపత్రులు, భారత వైద్య సంఘం (ఐఎంఏ) సంయుక్తంగా శుక్రవారం సంతాప సభ నిర్వహించారు. కొవ్వొత్తులు వెలిగించి ఆమె మృతి పట్ల నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఐఎంఏ విశాఖ అధ్యక్షుడు డాక్టర్ పీజే శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బాక్సింగ్ పోటీల్లో భీమిలి విద్యార్థిని ప్రతిభ

భీమునిపట్నం, ఆగస్టు 16 : పట్టణంలోని ఫ్యూచర్ ఇన్నోవేటర్స్ స్కూల్లో 7వ తరగతి చదువుతున్న వెంపాడ కుష్మిత జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీల్లో బ్రాంజ్ మెడల్ సాధించింది. ఈమేరకు శుక్రవారం ఆ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ది సన్ స్కూల్ అధినేత కైతపల్లి శ్రీనివాసరావు ఆమెను అభినందిస్తూ, రూ. 5 వేలు నగదు ప్రోత్సాహకం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల హరియానాలోని రోహతక్‌లో భారత్‌బాక్సింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో కుష్మిత ప్రతిభ చూపిందన్నారు. వచ్చే నెలలో జరిగే అంతర్జాతీయ పోటీల్లో ఆమె పాల్గొనున్నట్టు తెలిపారు.

మంగమారిపేట డ్రైనేజీలో పూడికలు



కాలువలో పేరుకుపోయిన పూడిక

భీమునిపట్నం, ఆగస్టు 16 : బీచ్‌రోడ్‌లోని మంగమారిపేటలో నిర్మించిన డ్రైనేజీలోరాళ్లు, మట్టి పడడంతో మురుగు నీటి ప్రవాహం ముందుకు సాగడం లేదు. ఇటీవల కురిసిన వర్షాలకు కాలువలో ఈ రాళ్లు పడ్డాయి. దీంతో ఎక్కడికక్కడ మురుగు నీరు నిలిచి పోవడంతో విపరీతమైన దుర్వాసన రావడంతో పాటు దోమలు వృద్ధి చెందుతున్నాయి. అధికారులు తక్షణమే కాలువలో పూడికలు తీయించాలని పలువురు కోరుతున్నారు.

'స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రం ఆదుకోవాలి'

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 16: స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రం ఆదుకోవాలని ఇంటక్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు కోరారు. ప్లాంట్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడున్నరేళ్లుగా స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యమం జరుగుతున్నప్పటికీ కేంద్రం ప్లాంట్‌ను నష్టపరిచే చర్యలు తీసుకుంటోందని ఆరోపించారు. ప్లాంట్‌ను పూర్తిగా నిర్వీర్యం చేసి, తద్వారా ప్రైవేటీకరించేందుకు కుట్ర జరుగుతోందన్నారు. బ్లాస్ట్‌ఫర్నేస్‌లు పూర్తిగా మూసే దిశగా ఉందని, ఈ సమయంలో కేంద్రం స్పందించాలని కోరారు.



గృహ సముదాయాలను ప్రారంభిస్తున్న ఐఆర్ఎస్ అధికారి ప్రవీణ్‌కుమార్

ఆదాయ పన్ను శాఖాధికారుల గృహ సముదాయం ప్రారంభం

సాగర్‌నగర్, ఆగస్టు 16 : సాగర్‌నగర్ వద్ద ఆదాయ పన్ను శాఖాధికారుల కోసం రూ. 10 కోట్లతో నిర్మించిన గృహ సముదాయాన్ని కేంద్రీయ ప్రత్యక్ష పన్నుల సభ్యుడు, కేంద్ర ఆదాయ పన్ను శాఖ చీఫ్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్ శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం పని ఒత్తిడిలో ఉండే అధికారులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్మించిన గృహాల్లో ప్రశాంతతో పాటు, ఆరోగ్యవంతమైన జీవనం సాగించే అవకాశం వుందన్నారు. సీనియర్ అధికారులకు ఈ గృహాలు కేటాయిస్తామని చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రధాన ముఖ్య ఆదాయపు పన్ను శాఖ కమిషనర్ మిథాలి మధుస్మిత మాట్లాడుతూ రెండు రాష్ట్రాల్లో నిర్మాణంలో ఉన్న వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల గురించి వివరించారు. హైదరాబాద్ తరువాత ఎక్కువగా ఇన్‌కంటాక్స్ డిపార్టుమెంట్‌కు సొంత కార్యాలయాలు, నివాస గృహాలు ఉన్న ప్రాంతం విశాఖ అని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ విశాఖ కమిషనర్ అసిత్‌కుమార్ మహాపాత్రో, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పూల ధర రెట్టింపు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 16 : శ్రావణ శుక్రవారం పూజల నేపథ్యంలో పూల ధరలు భారీగా పెరిగాయి. సాధారణ ధరల కంటే మూడు రెట్లకు పైగా ధరలు పెరగడంతో కొనుగోలుదారులు ఇబ్బంది పడ్డారు. ఒకవైపు దిగుబడి తగ్గడం, మరోవైపు వినియోగం పెరగడంతో గురు, శుక్రవారం పూలకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. కొద్దిరోజుల క్రితం వరకూ కిలో మల్లెలు రూ. 550 వరకూ ఉండగా, ఈ రెండు రోజులు రూ. 1500లకు పైగా విక్రయాలు సాగాయి. తెల్ల చామంతి కిలో రూ. 200 నుంచి రూ. 350, పసుపు చామంతి రూ. 150 నుంచి రూ. 450, కనకంబరాలు రూ. 100 నుంచి రూ. 350, లిల్లీ రూ. 150 నుంచి 500, జాజిపూలు కిలో రూ. 300 నుంచి రూ. 1000 వరకూ పెరిగాయి. పూజలకు పువ్వులు తప్పనిసరి కావడంతో సాధారణ రోజుల్లో కొనేదాని కంటే తక్కువ పరిమాణంలో కొనుక్కుని భక్తులు సంతృప్తి పడ్డారు.



అక్రమ మైనింగ్‌పై సీపీఎం పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న సీపీఎం కార్పొరేటర్ గంగారావు, తదితరులు

తగరపువలస/ఆనందపురం, ఆగస్టు 16 : ఆనందపురం మండలం కుసులవాడ పంచాయతీ చిన్నయ్యపాలెం వద్ద అక్రమమైనింగ్‌కు వ్యతిరేకంగా సీపీఎం పాదయాత్ర శుక్రవారం తగరపువలస నుంచి ప్రారంభమైంది ఈ సందర్భంగా పార్టీ కార్పొరేటర్ గంగారావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మైనింగ్‌కు అనుమతులు వచ్చాయని ఆ సమయంలో టీడీపీ ప్రతిపక్షంలో ఉండి వ్యతిరేకించగా అధికారంలోకి వచ్చాక నోరు మెదపడడం లేదన్నారు. చిన్నయ్యపాలెం వద్ద 20 ఎకరాల్లో మైనింగ్ చేయడానికి నిర్ణయం తీసుకున్నారని, ఏడాదికి 90 వేల టన్నుల కార్జ్ జైట్ రాయి, 50 వేల టన్నుల పునాదులు కట్టడానికి ఉపయోగించే రాళ్లను, 1.60 లక్షల టన్నుల గ్రావెల్ తవ్వకాలు చేయడానికి నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. 40 మీటర్ల లోతు వరకు తవ్వకాలు జరుపుతారని రోజుకు 3 వేల టన్నుల రాయిని ఎగుమతి చేస్తారని తెలిపారు. దీనివల్ల చిన్నయ్యపాలెం, కుసులవాడ, బాకూరుపాలెం, గొల్లలపాలెం, పందలపాక, జగన్నాథపురం, ఇచ్ఛాపురం, రేగానిగూడెం గ్రామాలన్నీ కాలుష్యంతో నిండిపోయి విషపూరితం కానున్నాయన్నారు. అలాగే పంటలు దెబ్బతినడంతో పాటు భూగర్భ జలాలు అడుగంటిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. పాదయాత్ర కుసులవాడ గ్రామం వరకు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తగరపువలస, చిట్టివలస ప్రాంతాలకు చెందిన సీపీఎం నాయకులు మూర్తి అప్పలనాయుడు, నరసింగరావు, శ్రీనివాస వర్మ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కేజ్రీవాల్ జన్మదిన వేడుకలు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 16 : ఆమ్ ఆద్మీ పార్టీ అధ్యక్షుడు కేజ్రీవాల్ జన్మదిన వేడుకలు ఎంవీపీ కాలనీలోని లెబెన్స్ హిల్ఫే మానసిక వికలాంగుల పాఠశాలలో శుక్రవారం ఘనంగా జరిగాయి. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు శీర రమేష్ కుమార్ కేక్ కట్ చేసి, పిల్లలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు డాక్టర్ శీతల్ మదన్, ఉపాధ్యక్షుడు వరదరాజ సాంచి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన భజనలు

సింహాచలం, ఆగస్టు 16 : వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో 365 రోజుల పాటు నిర్విరామంగా సాగిన నిత్య భజన సంకీర్తనలు శుక్రవారంతో ముగిసాయి. గతేడాది ఆగస్టు 16న నగరానికి చెందిన హిందూ ధర్మ ప్రచార సేవా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రారంభమైన నిత్య భజన సంకీర్తనల్లో ఉత్తరాంధ్రకు చెందిన అనేక భజన బృందాలు పాల్గొన్నాయి. ట్రస్ట్ వ్యవస్థాపకులు మారుతి సారథ్యంలో ఏడాది పాటు ప్రతిరోజూ సుమారు రెండు గంటల పాటు పలు భక్తి గీతాలను అప్పన్న ఆలయ ప్రధాన రాజగోపురం సమీపంలోని కళావేదికపై ఆలపించారు. ఆఖరి రోజున ఈఓ శ్రీనివాసమూర్తి నిర్వాహకుడ్ని సత్కరించి జ్ఞాపిక అందజేశారు.